COPYRIGHT STATEMENT

ప్రజాశక్తి

Vol. 3, no. 22

(Dec. 1, 1943)

బెజవాడ, 1943

Record no. 683

Prajāśakti

Vol. 3, no. 22

(Dec. 1, 1943)

Bejavāḍa, 1943

Record no. 683

0-2-0 Regd. No M. 4486

ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 3 సంచిక 22 | : సంపాదకవర్గం : మద్దుకూరి చంద్రశేఖరరావు (సం) కంభంపాటి సత్యనారాయణ ★ పుచ్చలపల్లి సుందరయ్య తుమ్మల వెంకటరామయ్య చలసాని వాసుదేవరావు | బుధవారం 1-12-43

కామ్రేడ్ స్టాలిన్‌కు ముస్లిం మతాధిపతి సందేశం

•

"పీడితప్రజలకు స్వాతంత్ర్యాన్ని సమకూర్చే యోధుడవని, ప్రజల అవసరాలనుతీర్చే నాయకుడవని, ముస్లిం ప్రపంచం అంతా నిన్ను గుర్తించుతోంది. నీ నాయకత్వాన శత్రువు అతిత్వరలో ఓడింపబడాలని, మానవజాతి యావత్తూ విముక్తిచెందాలనీ, నేను అల్లాను ప్రార్థించుతున్నాను." అంటూ సోవియటు యూనియన్‌లోని అఖిల ముస్లిం మతాధిపతి (ముఫ్తీ) కామ్రేడ్ స్టాలిన్‌కు సందేశం పంపాడు.

మధ్య యుగాలనాటి సంస్థానప్రజల్లో నూతన చైతన్యం

―――///―――

నైజాం ఆంధ్రులు జాగీర్దారుల అక్రమాల నెదుర్కొంటున్నారు

[బ్రిటిష్ ఇండియాకు నాగరిక ప్రపంచంతో కొద్దో, గొప్పో, సంబంధంఉంది. ప్రజలు చిరకాలంనుంచి వివిధ ప్రజాసంస్థల నాయకత్వాన తమ హక్కులకై అనేక పోరాటాలు సాగిస్తున్నారు. అనేక విజయాలు సంపాదిస్తున్నారు. అనేక గుణపాఠాలు నేర్చుకుంటున్నారు. కాని, నైజాం సంస్థానంలోనో ? బయటి నాగరిక ప్రపంచంతో అక్కడ ప్రజలకు సంబంధంలేదు. జాగీర్దార్లు ప్రజల్ని అనేక అక్రమాలకు గురి చేస్తారు. ఈ పరిస్థితుల్ని అంతంచేసి ప్రజల జీవిత పోరాటంలో నాయకత్వం వహిస్తూ, చక్కని రాజకీయచైతన్యం కలుగజేయడానికి ఆంధ్రమహాసభఎడతెగకుండా పాటుపడుతోంది. కొన్ని ఆంధ్ర ప్రాంతాలలో ఆంధ్రమహాసభ గావించిన కృషిని క్రింద సమీక్షచేస్తున్నాం]

★

నల్లగొండజిల్లా యందలి భువనగిరి తాలూకాలో సున్‌శాల అనే గ్రామంఉంది. అది జాగీరు గ్రామం. జాగీరుదారు అనేక సంవత్సరాలుగ రైతులవద్ద శిస్తుతోబాటు నాలుగుపుట్ల ధాన్యం అక్రమంగా వసూలు చేస్తూ ఉంటాడు. పట్టాభూములలో ఉన్న తుమ్మచెట్లను వేలంవేసి, అనేకవేల రూపాయల సంపాదిస్తూ ఉండేవాడు. ఆగ్రామంలో ఆంధ్రమహాసభయొక్క గ్రామసంఘం స్థాపింపబడిన తదుపరి రైతులు యీ రెండు అక్రమాలను వ్యతిరేకించారు. విధిలేక జాగీరుదారు చెట్లవేలం ద్వారా వచ్చే ఆదాయాన్ని మాపు చేయవలసి వచ్చింది. గ్రామాన్ని బందోబస్తు (సెటిల్మెంటు) చేయించుటకు వాగ్దానం యిచ్చాడు. ప్రస్తుతం ధాన్యంమాత్రం కొందరి వద్ద వసూలు చేయగలుగుతున్నాడు. దీన్ని కూడా మాపుచేయుటకు ఆంధ్ర మహాసభ ప్రయత్నిస్తోంది.

కూతురు పెండ్లికి 40 వేల రూపాయలు !

రాజుపేట సంస్థానంలో 9 జాగీరు గ్రామాలున్నాయి. రాజాగారు గతసంవత్సరం తమ కూతురు పెండ్లి సందర్భంలో ఆ 9 గ్రామాల నుండి దాదాపు 40 వేలరూపాయలు బలవంతంగా వసూలుచేయ ప్రయత్నించారు. ఆంధ్ర మహాసభ కార్యకర్తల ఆందోళన ఫలితంగా, నల్లగొండజిల్లా దువ్వంసాబు (సెకండ్ కలెక్టరు)పై 9 గ్రామాలప్రజలువచ్చి తమయిబ్బందుల్ని తెలియజేసుకోవలసినదిగా చాటింపు వేయించాడు. నమిలె, కవుతిముగూడెం, బావుపేట మొదలైన గ్రామాలనుండి రైతులు వచ్చి, తమపై విధించబడిన 40 వేల రూపాయలు అక్రమమనీ, చెల్లించుకోజాలమనీ, మొఱపెట్టుకున్నారు. తత్ఫలితంగా, యీ అక్రమ వసూలు శాశ్వతంగా ఆపుజేయబడింది.

హిందూ-ముస్లిం రైతాంగంలో ఐక్యత

కొలనుపాక జాగీరులో కొలనుపాక, బొందుగుల, కందుకూరు, రఘునాథపురం—అనే నాలుగు గ్రామాలు ఉన్నాయి. జాగీర్దారు 15 సంవత్సరాలక్రితం వాటిని 8 విజన్ చేయించి, అదనంగా 10 వేల రూపాయలు అక్రమపుపన్ను వసూలువేస్తున్నాడు. దీన్ని అరికట్టాలని ఆంధ్రమహాసభ నిశ్చయించుకొంది. జాగీర్‌లో నివసించే హిందూ-ముస్లిం రైతాంగాన్ని ఒక్క తాటిమీద నడిపించ సాగింది. ఈ అక్రమపు పన్నును యివ్వ నిరాకరించారు అంతా. జాగీర్దారు దిగివచ్చి, 10 వేలలో 3 వేలు తగ్గించివేశాడు. రైతులు మిగతా 7 వేలరూపాయలనుకూడా రద్దుచేయవలసిందని కోరుతూ జాగీర్దారుకు దరఖాస్తులు పెట్టుకున్నారు. వాటిపై హిందువులు - ముస్లిములు సంతకాలు చేశారు.

ఏఐక్యతతో 3 వేలరూపాయల అక్రమపు పన్నును రైతులు రద్దుచేయించుకొనగల్గారో, ఆ ఐక్యతతోనే మిగతా 7 వేల రూపాయలను కూడా రద్దుచేయించుకోగలరు.

చెట్లపై హక్కు రైతుదే ! జాగీర్దారుది కాదు

కాచార మనేగ్రామంలో జాగీర్దారు రైతుల పట్టా భూములలోని చింతచెట్లను వేలంవేసి, వేలం పన్ను తానే వసూలుచేసుకొనేవాడు. ఆంధ్రమహాసభ కార్యకర్తలు రైతులలో చేసిన ఆందోళన ఫలితంగా, రైతులు తమకే చెట్లపై హక్కు ఉన్నదని దరఖాస్తులు పెట్టుకున్నారు. ప్రజల ఐక్యతాబలంముందు జాగీర్దారుకున్న బలం కుప్పకూలినట్లు కూలిపోయింది. చింతచెట్లను, మామిడిచెట్లను, రైతులకు స్వాధీనం చేయవలసివచ్చింది.

రైతులకు వర్తకుల సహాయం

జనగామ తాలూకాలో గూడూరు అనే గ్రామం ఉంది. ఆంధ్రమహాసభ నల్లగొండ జిల్లా కార్యదర్శి అక్కడి వర్తకుల్ని సమావేశపరచి, వేరుశెనగ రైతులు చెల్లించవలసిన నాగు (నాము) విషయంలో సహాయం చేయవలసిందని విజ్ఞప్తి చేశారు. గత సంవత్సరంలో వర్తకులు 100 పుట్లు వేరుశెనగ విత్తనాలను సరినాగు పద్ధతిపై [అనగా రెట్టింపు నాము) యిచ్చారు. కార్యదర్శిచేసిన విజ్ఞప్తి ఫలితంగా, సగం నాగుతే తీసుకొంటామని వర్తకులు వాగ్దానం చేశారు. దీనికి సమీపంలో ఉన్న ఇప్పగూడెంలో కూడా వర్తకులు సగం నాగే తీసుకొంటున్నారు. ఈ రెండు గ్రామాలలోను ఆంధ్రమహాసభశాఖలు ఏర్పడి పనిచేస్తున్నాయి. సభ్యులు విరివిగా చేరుతున్నారు.

గ్రంధాలయాలు, పాఠశాలలు

ప్రజల ఆర్థిక హక్కులకొరకే గాకుండా, వైజ్ఞానికసమస్యలనుకూడా ఆంధ్ర మహాసభవారు పరిష్కరిస్తున్నారు. రఘునాథపల్లెలోవిజయదశమి రోజునహిందువులు-ముస్లిములుకలిసి ఒక గ్రంథాలయాన్ని స్థాపించి, చక్కగా నడుపుకొంటున్నారు. మూడుసంవత్సరాలక్రితం మతకలహాలు జరిగిన ప్రదేశంఅది.

ఇలాగే, భువనగిరి తాలూకాయందలి అరూరు గ్రామంలో 1500 రూపాయలు వసూలుచేసి, భవననిర్మాణమునకు, గ్రంధాలు కొనుటకు, సన్నాహాలు జరుగుతున్నాయి.

కాచార మనే గ్రామంలో రైతులు సాలీనా లోకల్‌ఫండుకు రు. 250 చెల్లిస్తూన్నప్పటికీ, జాగీర్దారు నామకార్థం ఒక పాఠశాలను స్థాపించి యున్నాడేగాని, సక్రమ పద్ధతిలో దానిని నడుపుటలేదు. గ్రామస్థులు అనేకసార్లు దరఖాస్తులు పెట్టుకున్నప్పటికీ, ప్రయోజనం కనపడలేదు. దానిమీదట మరొక గ్రామం నుంచి ఒక ఉపాధ్యాయుని తీసుకొచ్చి, తమ పిల్లలకు చదువు చెప్పించుకొంటున్నారు. ఇక మీదట జాగీర్దారు పాఠశాలను సక్రమపద్ధతిలో నడుపకపోతే, తాము చెల్లించే లోకల్‌ఫండుతో తామే స్వయంగా నడుపుకొంటామని జాగీర్దారుకు తెలియజేశారు.

పాలేరుపట్టి ఆంధ్రమహాసభ

నవంబరు 8, 9 తేదీలలో 2 వ పాలేరుపట్టి (ఫిర్కా) ఆంధ్రమహాసభ చెన్నారంగ్రామంలో (ఖమ్మం తాలూకా) జరిగింది. శ్రీకొలిపాక వెంకట కిషన్‌రావుగారు అధ్యక్షతవహించారు. 2 రోజుల క్రితమే జరుగవలసిన యీ సభకు అనుమతి రానందున ప్రజలు చాలమంది తిరిగివెళ్ళిపోయారు. అందువల్ల 500 మంది మాత్రమే వచ్చారు. వివిధ తాలూకాలనుండి వచ్చిన 40 మంది ప్రతినిధులు చర్చలలో పాల్గొన్నారు. శ్రీ పోల్కంపల్లి వెంకట్రామారావు, బి. ఏ. ఎల్. ఎల్. బి. గారు సమావేశంలో ఉపన్యసిస్తూ, ప్రస్తుతం దేశంలో ఆవరించియున్న కరువును పరిష్కరించుటకై దేశీయులందరు కలిసి పనిచేయాలని హెచ్చరించారు. సభలు జరుపుకొనుటలో ప్రభుత్వం కలిగించే ఆటంకాలను లెక్కజేయకుండా రైతులు అధికాహారోత్పత్తిని కొనసాగిస్తూ, సోదర ప్రజలను కాపాడవలసిందని హెచ్చరించారు.

రెండవరోజు సమావేశంలో దాదాపు 1500 మంది ప్రజలు పాల్గొన్నారు. అధికాహారోత్పత్తి - పాలేరు ప్రాజెక్టు నిర్మాణం; గ్రామప్రజల సౌకర్యాలు; ఆహారసమస్య - ప్రభుత్వస్కీము; రాజకీయ ప్రతిష్టంభన: బెంగాల్ కరువు సహాయం మొదలైన సమస్యలపై 13 తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించబడ్డాయి.

రెండవరోజు ఉదయమె ప్రభాతభేరీ జరుగుతుండగా, గ్రామమందలి గోడలమీద అంటించబడిన కాగితాలు కొన్ని కనపడ్డాయి. అందులో కొందరు గ్రామస్థుల పేర్లను ఉదాహరిస్తూ, వారు కృష్ణాజిల్లా కమ్యూనిస్టు పార్టీకి అనుబంధంగా ఒక కమిటీని స్థాపించినట్లు, లూటీలు - దోపిళ్లు మొదలైన విధ్వంసక చర్యలు వీరి కార్యక్రమమైనట్లు ఉంది. కామ్రేడ్ పి. రమణ దీని విషయమై ఒక గంటసేపు ఉపన్యసించాడు. కమ్యూనిస్టుపార్టీ యొక్క కార్యక్రమం నేడు దేశంలో అందరికీ తెలుసునన్నాడు. పచ్చి అబద్ధాలతో గోడలను ఖరాబుచేయడంవల్ల ప్రజలు మోసపోరని ప్రకటించాడు. తాను కమ్యూనిస్టులు లూటీలకువ్యతిరేకంఅన్నాడు. కమ్యూనిస్టునన్నాడు. కమ్యూనిస్టుల పేర యిట్టి కార్యక్రమాన్ని ప్రచారంచేసిన నీచుల్ని 1500 మంది ప్రజల యెదుటబట్టబయలుచేశాడు. ఉపన్యాసానంతరం "పంచమాంగదళాన్ని వేరుచెయ్యాలి!" అనే నినాదం మిన్నుముట్టింది.

రాత్రి 7 నుండి 9 వరకు కోలాటం, భజన, పడవపాట మొదలైన వైజ్ఞానిక కార్యక్రమం కొనసాగింది. భోజనానంతరం "కష్టజీవి" అనేబుర్రకథచెప్పారు. ఈకార్యక్రమంలో 800 మంది పురుషులు, 400 మంది స్త్రీలు ఉత్సాహంతో పాల్గొన్నారు.

అధికాహారోత్పత్తికి రైతుల సంసిద్ధత

17-11-43 వ తేదీ సాయంకాలం దాదాపు 1000 మంది రైతులు బీబీనగర్‌లో (అత్తరాఫ్‌బల్దాజిల్లా) అధికాహారోత్పత్తి సమావేశంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సమావేశానికి శ్రీ రాజాబహదూర్ వెంకటరామారెడ్డి ఓ. బి. ఇ. గారు అధ్యక్షులు భూములలో ఎరువులువేసి నవీన వ్యవసాయపద్ధతులద్వారా ఆహారాన్ని అధికంగా పండించాలనీ, రైతుల కనీస అవసరాలుపోను మిగతా ధాన్యాన్ని తరుగు ప్రాంతాలకు పంపవలసిందనీ, అధ్యక్షులు హెచ్చరించారు. తరువాత శ్రీ ఆరుట్ల రామచంద్రారెడ్డిగారు ఉపన్యసిస్తూ, దేశరక్షణకై రైతులు ఎక్కువగా పండించడం అవసరమని తెలియజేశారు. శ్రీ రావి నారాయణరెడ్డిగారు, కరువునివారణకై ఆహార ధాన్యాల ధరలకు కంట్రోలు ఎలా అవసరమో, రైతులకు కూడా అది యెలా మంచిదో వివరిస్తూ ఉపన్యసించారు.

తరువాత ఆరుట్ల కమలాదేవిగారు, అరుంధతీదేవిగారు, వేదవతీదేవిగారు, బాలమణిగారు, మహిళా ఉద్యమంయొక్క ఆవశ్యకతను గురించి ఉపన్యసించారు. మరికొందరు ఆంధ్రమహాసభ కార్యకర్తలు ప్రజల సమస్యలపై ఉపన్యసించిన తరువాత జయజయధ్వానాలతో సమావేశం ముగిసింది.

ఈ విధంగా, హైదరాబాద్ సంస్థానంలో నివసించే ఆంధ్ర ప్రజానీకం ఆంధ్రమహాసభ నాయకత్వంక్రింద తమ ప్రాథమిక హక్కులకై పోరాటాలు సాగిస్తూ, రాజకీయ చైతన్యంతో ఉజ్వలభవిష్యత్తువైపుకు సాగిపోతున్నారు.

బుధవారం ప్రజాశక్తి 1-12-43

వెంటనే ప్రభుత్వం తప్పును దిద్దుకోవాలి.

నేటినుంచి కడప, చిత్తూరు, సేలం, ఉత్తర ఆర్కాట్ జిల్లాలలో తిరిగి కల్లుపాకలు విచ్చలవిడిగా తెరువబడతాయి. ఈ జిల్లాలలో కాంగ్రెసు మంత్రివర్గం ప్రవేశపెట్టిన మద్యపాన నిషేధ చట్టాన్ని ఎడ్వైజరీ ప్రభుత్వం రద్దుచేసింది.

ఇందుకు ప్రభుత్వం చూపిన కారణాలేమిటి ?

—ఈ చట్టాన్ని ధిక్కరించే నేరస్థుల సంఖ్య ఎక్కువౌతోంది.

—ప్రభుత్వానికి అనధికార వర్గాల సహకారంగాని, ప్రజల తోడ్పాటుగాని, లభించడంలేదు.

—ఇన్‌ఫ్లేషన్ (అనగా, దేశంయొక్క అవసరాలకంటె ఎక్కువ ధనం చెలామణీలో ఉండడం)ను తగ్గించేటందుకు కొంత ధనాన్ని ప్రభుత్వం చెలామణీలో నుండి తొలగించాలి. అప్పుడు ధరలు యిప్పుడున్నంత విపరీతంగా ఉండవు.

—కొత్తగా తీసిన తాటికల్లులో మనిషికి కావలసిన ఆహార పదార్థాలుంటాయి, వాటిని కార్మికుల కందజేయడం ముఖ్యం.

నిజం ఆలోచిస్తే, యివి సరియైన కారణాలుకాదు. బడ్జటును భర్తీచేయడానికి కొంత అదనపు ఆదాయం అవసరమయింది. అందుకు ప్రభుత్వం యీవిపరీత చర్యకు పూనుకొంది. ఈ విషయాన్ని ప్రజల ముందు పెట్టడానికి వెరచి, యేహో కొన్ని సాకులు చెప్పింది. కాకపోతే—నేరాలు యెక్కువౌతున్నప్పుడు వాటిని తగ్గించడానికి బందోబస్తు చేయాలిగాని, చట్టాన్నే యెవరు రద్దుచేస్తారు ? ప్రజల సహకారం లభించకపోతే, అట్టి సహకారం కొరకు ప్రయత్నించాలిగాని, తిరిగి కల్లుముంతలకు పట్టాభిషేకం యెవరు చేస్తారు ? ఇన్‌ఫ్లేషన్‌ను తగ్గించడానికి యుద్ధఋణాలవంటి పద్ధతులు నేడు అమలులో ఉన్నవేగదా !

అసలు విషయం ఏమంటే, ఈ దుర్వ్యసనంవల్ల ప్రజల ఆరోగ్యం, నైతిక శక్తి ఎంత పతనమౌతుందో ప్రభుత్వం గ్రహించకుండా, ఆదాయంకొరకు చట్టాన్ని రద్దుచేసింది. 7 వేల గ్రామాలలో నివశించే పేద ప్రజలు తిరిగి విచ్చలవిడిగా కల్లుపాకలపై కెగబడి, రోజల్లా కష్టించి సంపాదించిన కూలిడబ్బులతో రోగాలు, అనారోగ్యం, కొని తెచ్చుకోవడం నేటి పరిస్థితులలో దేశానికి ఎంత హానికరమో ప్రభుత్వం గుర్తించలేదు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేటందుకు ఎంత ధనమైనా సేకరించి, ఖర్చుపెట్టాలిగాని, ఆదాయం కొరకు ప్రజల ఆరోగ్యాన్నే ధ్వంసం చేయడం ఎడ్వైజరీ పరిపాలన యొక్క స్వభావాన్ని తెలియజేస్తుంది.

యుద్ధకాలంలో ఏ ప్రభుత్వానికైనా అనేక అదనపు ఖర్చులు అవసరమౌతాయనే యదార్థాన్ని మేము గుర్తించకపోవడంలేదు. అయితే, వాటిని వసూలు చేయడంలో ప్రజల ఆరోగ్యానికిగాని, నైతికశక్తికిగాని, ఆర్థిక సౌష్ఠవానికిగాని, హానికలుగకుండా చూడాలి. ధనిక వర్గాలపై యిప్పటికంటె అధికంగా ప్రత్యక్షపు పన్నులు విధించి, ఎక్కువ ఆదాయం సంపాదించవచ్చు. స్వయంగా సంపాదించని కొన్ని పెద్ద ఆస్థులపై కొత్త పన్నులను విధించవచ్చు. అంతేగాని, యిప్పటికే పన్నుభారంతోను, ఋణభారంతోను, కృంగిపోయి, పట్టెడన్నం కొరకు నానా యాతనలుపడే బీదలమీద పరోక్షంగా యిట్టి భారం వేయకూడదు. యుద్ధకృషికి ప్రజలు తమ సర్వశక్తులూ వినియోగించాలంటే, వారి మనోనిబ్బరాన్ని, ఆరోగ్యాన్ని ప్రభుత్వం కాపాడాలి. కాని, మద్రాసు ప్రభుత్వం యిందుకువిరుద్ధంగా ప్రవర్తిస్తోంది.

ఇప్పుడైనా మించిపోయిందేమిలేదు. ప్రభుత్వం తన తప్పుడు దృక్పథాన్ని మార్చుకొని, పై నాలుగు జిల్లాలలోను మద్యపాన నిషేధచట్టాన్ని అమలుజరపాలి. ఇందు కవసరమైన ప్రజాసహకారం తప్పక లభించుతుంది. రాజధానిలో ఉన్న వివిధ రాజకీయ పార్టీలు కూడా యీ విషయంలో ప్రభుత్వంమీద బలమైన ఒత్తిడి తీసుకురావాలి. మొన్న 25 వ తేదీని మద్రాసులో యేర్పడ్డ ప్రచారక సంఘం తీవ్రంగా ఆందోళన చేయబోతూంది. అందరూ దానికి సర్వవిధాల తోడ్పడడం అవసరం. జస్టిస్‌పార్టీ నాయకుడైన ముత్తయ్యశెట్టియార్, ఎసెంబ్లీ ముస్లింలీగ్‌పార్టీ నాయకుడైన హమీద్‌ఖాన్, యిందుకు తమ వ్యతిరేకతను సూచించుతున్నారు. వీరికి కాంగ్రెసు యెడలగల వ్యతిరేకతే యిందుకు కారణం అనాలి. కాని, మద్రాసు రాజధాని ముస్లింలీగ్ నాయకులు, కొందరు జస్టిస్‌పార్టీనాయకులు ప్రభుత్వ చర్యను ఖండిస్తూ ప్రకటనలు చేశారు. ఇదేవిధంగా, అన్ని రాజకీయ పార్టీలకు చెందినవారు మద్యపాన నిషేధ చట్టాన్ని బలపరుస్తూ, ప్రభుత్వచర్యను గర్హించాలి. ఆంధ్ర చేంబర్ ఆఫ్ కామర్సు వంటి వాణిజ్యసంస్థలు యీ అవకాశాన్ని తీసుకొని, అమ్మకపుపన్నును రద్దుచేయవలసిందని కోరుతున్నాయి. ఈ చట్టాన్ని అమలు పరచడంకొరకే అమ్మకపు పన్నువిధించబడినదను విషయం నిజమే. అయినప్పటికీ, కేవలం స్వలాభాపేక్షతో యితర ప్రజాసంస్థల కోర్కెకు భిన్నంగా వ్యవహరించడం సరియైన మార్గంకాదు.

ఆంధ్రరాష్ట్రంలో ఉన్న ప్రజాసంస్థలు, ముఖ్యంగా ప్రతి రైతుసంఘం, వ్యవసాయకూలీ సంఘం, లేబర్‌యూనియన్, ఎడ్వైజర్ల నిర్ణయాన్ని ఖండిస్తూ తీర్మానాలు చేసి వాటితో ప్రభుత్వ కార్యాలయాన్ని నింపివేయాలి.

★ మనరాజకీయాలు

బెంగాల్ మంత్రులు ఆడే ప్రమాదకరమైన జూదం

— కంభంపాటి సత్యనారాయణ

క్రిందటినెల 19 వ తేదీని, బెంగాల్ మంత్రివర్గంలో సభ్యుడైన షుర్వార్దీ అధ్యక్షత కింద వివిధరాజకీయ పార్టీల సమావేశం జరిగింది. త్వరలో కోతకు రానున్న శీతాకాలపు పంటను ప్రజలకు ప్రభుత్వం యెలా అందజేయ బోతూన్నదీ అతడాసమావేశంలో వివరించాడు. ప్రభుత్వం ధాన్యాన్ని మణుగు రు. 5 లకు రు. 8 లకు, మధ్య యిచ్చి కొంటుందన్నాడు. బియ్యాన్ని రు. 8 లకు, రు. 10 లకు, మధ్య యిచ్చికొంటుందన్నాడు. రాష్ట్రంలో యిప్పు డమలులో ఉన్న వర్తకవిధానాన్నే సాధ్యమైనంతవరకు వినియోగించుకొంటాం అన్నాడు.

ఇలాగే, 23 వ తేదీని కౌన్సిల్ ఆఫ్ స్టేట్ సమావేశంలో ఇండియా ప్రభుత్వ సభ్యుడైన శ్రీవాస్తవ ఉపన్యసిస్తూ, మిగులు ప్రాంతాలలో పండిన పంటను తరుగు ప్రాంతాల కందజేయడంలో మామూలు వర్తక పద్ధతులపైనే బెంగాల్ ప్రభుత్వం ఆధారపడవలసి యుంటుందన్నాడు. రైతులవద్ద ప్రభుత్వం కొత్తరోజులలో కొనబోయే సరుకు బహుస్వల్పంగానే ఉంటుందన్నాడు.

షుర్వార్దీవేసే కొత్తఎత్తు

వీటి అర్థంఏమిటి? బెంగాల్ మంత్రివర్గం, ఇండియాప్రభుత్వం కూడా మార్కెట్‌ధరలు తగ్గుతాయనీ, సరుకును అప్పుడు విరివిగా కొనవచ్చుననీ, ఎప్పటిమాదిరిగానే ఆశించుతున్నారు. కొత్త పంట మణుగు రు. 5 ల వరకు తగ్గితేనేగాని తాము కొనదలచుకోలేదని యిటీవల షుర్వార్దీ ఒక ముస్లింలీగ్ వర్కర్ల సమావేశంలో ప్రకటించాడు. ఇట్టి బెదరింపులవల్ల నిలవ వ్యాపారస్థుల్ని, తిండి దొంగల్ని, లొంగదీయవచ్చునని యీతని ఆశ ! వారు మార్కెట్ ధరను ఇప్పుడైనా తగ్గించకపోతారా ? అని అతని ధీమా ! షుర్వార్దీ నిజంగానే యిలా చేయదలచుకొంటే ఇంతకంటె ప్రమాదకరమైన జూదం మరొకటి ఉండబోదు. ఈమధ్య ధాన్యం ధరలు, బియ్యం ధరలు, కొద్దిగా తగ్గినమాట వస్తవమే కాని, ఇది నిలవ వ్యాపారస్థుల హృదయ పరివర్తన వల్లకాదు. ధరల కంట్రోలువల్ల అసలేకాదు.

తిండిదొంగల సన్నాహాలు

ధరలు తగ్గడానికి నిజమైన కారణం ఏమంటే, చాలాకాలంనుంచి నిలవ ఉన్న పాతధాన్యాన్ని, పాతబియాన్ని, అమ్మివేసి, కొత్త పంటను కొనడానికి తిండి దొంగలు సన్నాహాలు చేస్తున్నారు. బియ్యంగాని, ధాన్యంగాని, కొంత కాలం వరకే నిలవఉంటాయి. ఎల్ల కాలం ఉండవు. గొడౌన్లలో అవి ముక్కిపోయి చెడిపోయేకంటె తక్కువ ధరకు అమ్మివేయడం మంచిదికాదా ? కనుకనే, తిండి దొంగలు మార్కెట్ ధరలను తగ్గించి పాతసరుకును అమ్ముతున్నారు !

అనగా, బెంగాల్ ప్రభుత్వం మొదట్లోనే కొత్తపంటను కఠినమైనపద్ధతులతో కంట్రోల్ చేయకపోతే, వెంటనే ధరలు మళ్లా విపరీతంగా పెరుగుతాయన్నమాట.

వ్యతిరేక పార్టీల నినాదం

లీగ్ మంత్రివర్గాన్ని పడగొట్టడానికి వ్యతిరేక పార్టీలన్నీ యిస్తూన్న నినాదం: కొత్త పంటవిషయంలో ప్రభుత్వం జోక్యంకలిగించుకోకూడదు; స్వేచ్ఛావ్యాపారానికి సంపూర్ణమైన అవకాశాలివ్వాలి ! దీని అర్థం, తిండి దొంగలకు పూర్తియైన స్వేచ్ఛ యివ్వాలన్నమాట. ఈ వ్యతిరేక వర్గాలను సంతృప్తి పరచడానికి షుర్వార్దీ నిలవవ్యాపారస్థులకు లొంగిపోయాడు. కొత్తపంటను తమ యిష్టంవచ్చినప్పుడు విచ్చలవిడిగా కొనుక్కోవచ్చునని వారి కతడు హామీయిచ్చినట్లు కనబడుతోంది. ప్రభుత్వం కూడా రైతులవద్ద సరుకును కొనబోతూన్నప్పటికీ, తిండిదొంగల స్వేచ్ఛావ్యాపారానికి ఏవిధంగాను ఆటంక కలుగని పద్ధతిలోనే కొనేటట్లు ఒడంబడిక జరిగిందా ? అని అనుమానించ వలసి వస్తోంది. కైతాన్ వంటి వ్యతిరేకపక్షపువ్యాపారస్థుల్ని ప్రభుత్వం ఏజంట్లుగా నియమించినదంటే, ఇంత కంటే మరొక అర్థం కనబడదు.

నిరంకుశాధికారుల ఒత్తిడి

ఎందువల్ల ఈ విధంగా, బెంగాల్ మంత్రివర్గం ఒకవైపు నిలవవ్యాపారస్థులపై ఆధారపడుతూ, మరొకవైపు మార్కెట్ ధరలు తగ్గుతాయని ఆశిస్తోంది ? ఎందువల్లనంటే, నిరంకుశాధికారుల ఒత్తిడికి లొంగి, ప్రజల శక్తిమీద ఆధారపడ్డానికి అది జంకుతోంది. అనేక ప్రాంతాలలో పనిచేస్తూన్న ఆహార కమిటీలద్వారా ప్రభుత్వం కొత్త పంటను సేకరిస్తే, నిలవ వ్యాపారస్థుల్ని ఓడించవచ్చు. ప్రజల్ని కరువునుండి సులభంగా కాపాడవచ్చు. కాని, ప్రభుత్వం యిందుకంగీకరించడంలేదు.

బెంగాల్‌లో యీ రోజున లక్షలాది ప్రజలు కరువు రాక్షసికి ఆహుతి అవుతున్నారంటే, అందుకు కారణం బెంగాల్‌లోని రాజకీయ పార్టీలు కలిసి పనిచేయడానికి నిరాకరించడం; లీగ్‌మంత్రివర్గానికి ప్రతికక్షులు సహాయం చేయక పోవడం; సంయుక్త మంత్రివర్గ స్థాపనకై నజిముద్దీన్ మంత్రివర్గం ప్రయత్నించకపోవడం; చివరకు ప్రజా ప్రతినిధులున్న ఆహార కమిటీలను విశ్వసించకపోవడం. బెంగాల్ ముస్లింలీగ్ అయినా వెంటనే సమావేశం అయి, ఆహారకమిటీలద్వారా ప్రభుత్వం కొత్త పంటను కొనేటట్లు చేయకపోతే కరువు యింకా అనేకరెట్లు భయంకరంగా పరిణమించుతుంది. 29—11—43.

సవరణలు

ఈ సంచికయందలి 3 వ పేజీ, మొదటి కాలం నాల్గవపేరాలో "అన్ని జిల్లాలలో మొత్తం400 మంది" అనివుంది, "500 మంది" అని సవరణ చేసుకోవాలి.

3 వ పేజీ "ఐక్యప్రజల ముందు అధికారుల లొంగుబాటు" అనే శీర్షికలో "ఈలోగా స్థానికాధికారులతో" అని ప్రారంభమయ్యే పేరాలో, "వార్‌లోన్ బాండ్లుపైన సంపాదకీయం వ్రాసిన ప్రజాశక్తిని చూడమని" అను వాక్యం తీసివేయాలి. "ఇదివరలో వార్‌లోన్ బాండ్సుపై ప్రజాశక్తి వ్రాసిన విషయాలను చూడమని" అని ఉండాలి.

4 వ పేజీ రెండవకాలం మొదటిపేరా చివర "మీరు నాటలేరు" అనుదానికి బదులు "మీరు నాటలేదు" అని వుండాలి.

24—11—43 సంచికలో 1 వ పేజీ 1 వ కాలం 6 వ పేరాలో 5 వ పంక్తిలో "వీటికి అనుకూలురైన" అనుదానికి బదులుగా "వీటికి ప్రతికూలురైన" అని ఉండాలి.

జీవచ్ఛవానికి ప్రాణంపోయుటకై జస్టిస్‌పార్టీ ప్రముఖుల ప్రయత్నాలు

—మా విలేఖరి

ఎసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెసుకు అఖండ విజయం లభించినప్పటినుంచీ, మన రాష్ట్రంలో జస్టిస్‌పార్టీ జీవచ్ఛవంగా తయారైంది. అట్టిపార్టీకి తిరిగి ప్రాణంపోయడం కోసం శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డిగారు, మరి కొందరు జస్టిసు ప్రముఖులు, ప్రయత్నాలు చేస్తున్నారు. "మదరాసు రాష్ట్ర వ్యవసాయదారుల సంఘా"న్ని పునర్నిర్మించడం అట్టి ప్రయత్నాలలో ఒకటి.

ఈ సంఘానికి కృష్ణాజిల్లాలో ఒక అనుబంధశాఖను స్థాపించవలెననే ఉద్దేశంతో, గతమాసం 24 వ తేదీని గుడివాడలో వడ్డి శోభనాద్రిగారు ఒక సమావేశాన్ని ఏర్పరిచారు. బెజవాడ రామచంద్రారెడ్డిగారు దీనికి ప్రారంభోత్సవం జరిపారు. కాజ లక్ష్మీనారాయణగారు అధ్యక్షత వహించారు. జిల్లా నుండి చాలమంది ధనికరైతులుసమావేశానికి హాజరయ్యారు.

ధనికరైతుల ప్రయోజనాలు

ఈ "వ్యవసాయదారుల సంఘం" కేవలం ధనిక రైతుల ప్రయోజనాలకు పనిచేస్తూ వచ్చింది. కొద్ది నెలలక్రితమే, పుట్టిధాన్యం రు. 200 కు కంట్రోలుచేయాలనే నినాదం బయల్దేరతీసింది. ఈ నినాదం మన ప్రజాబాహుళ్యానికేగాక, రైతులందరి స్వప్రయోజనాలకే యెలా నష్టదాయకమో స్పష్టీకరిస్తూ, కృష్ణాజిల్లా రైతుసంఘం అనేక గ్రామాలలో ప్రచారంచేసింది. బస్తాధాన్యం రు. 11 లకు కంట్రోలు చేయాలనీ, రైతు కవసరమైన యితర జీవితావసర వస్తువుల ధరలను కూడా కంట్రోలు చేయాలనీ, ఆందోళన చేసింది.

ప్రవాహానికి ఎదురీత

కాని, రామచంద్రారెడ్డిగారు కాలవాహిని కెదురీద సమకట్టారు. తమ ఉపన్యాసంలో, రైతుసంఘాలు రైతులవిషయమై ఏమాత్రం శ్రద్ధ తీసుకోవడం లేదని విమర్శించారు. ఈ విషయం తమకు అధికారులద్వారా తెలిసిందట: అందుకోసం తాము "వ్యవసాయదారుల సంఘా"న్ని స్థాపించారట ! కాని, యీ సంఘానికి రాజధానిలో ఎంత బలం ఉన్నదో కూడా రెడ్డిగారు దయతో తెలియజేశారు. అన్నిజిల్లాలలో మొత్తం సభ్యులు 400 మంది: కృష్ణాజిల్లాలో 10 మంది ! అందువల్ల తమ సంఘంలో వెయ్యిమందైనా సభ్యులుగా చేరవలసిందని హెచ్చరించారు. కాని, యిందుకు ఉత్సాహంగాని, సంతోషం గాని వచ్చినవారి ముఖాలలో యెక్కడా కనపడలేదు.

జిల్లా రైతు సంఘ కార్యకలాపం

కృష్ణాజిల్లాలో గత 8 సంవత్సరాలుగా జిల్లా రైతుసంఘం రైతులకోర్కెలకై పనిచేస్తూన్న విషయం అందరికీ తెలుసు.

750 గ్రామాలలో ప్రాథమిక రైతు సంఘాలున్నాయి. మొత్తం సభ్యత్వం 35 వేల మంది. ప్రతి తాలూకాలోనూ తాలూకా రైతుసంఘాలు పనిచేస్తున్నాయి. జిల్లా రైతుసంఘం చేసిన ఆందోళన ఫలితంగా, ఆయకట్టులో కొత్తగాచేరిన భూములపై 30 లక్షల రూపాయల నజరానా వసూళ్ళను ప్రభుత్వం వాయిదా వేసింది. బుడమేటి వరదలవల్ల ముంపు పాలౌతూన్న 60 వేలయకరాలను ముంపు నుండి తప్పించుటకూ, 40 వేల యకరాలను అదనంగా సాగులోకి తీసుకు రావడానికీ, బుడమేటిస్కీమును ప్రారంభించవలెనని, జిల్లా రైతుసంఘం చిరకాలంనుంచీ ఆందోళనచేస్తూంది. కొత్తగా సాగు చేయబడిన భూములపై పెనాల్టీలను రద్దుచేయించుటకూ, నీటివనరులనభివృద్ధిపరచుటకూ, కృషిచేసి, అనేక విజయాలు సాధించింది. జమీందారీ రైతులహక్కులకై కొన్ని పోరాటాలను నడిపింది. జిల్లాసంఘం తరపున 3600 యకరాల బంజరు భూమిని రైతులు సాగుకుతెచ్చారు. ఎరువులకై ప్రభుత్వం యీ జిల్లాకుమంజూరుచేసిన మొత్తంలో 2 లక్షల 50 వేల రూపాయల అప్పును రైతులకు సక్రమంగా యిప్పించింది. కూలీలకు - రైతులకు మధ్యసామరస్యం కుదిర్చి, గ్రామైక్యతను నెలకొల్పుతూంది.

ఈవిధంగా, రైతుల శ్రేయస్సుకై జిల్లా రైతుసంఘం పనిచేస్తూంటే, దీనికి పోటీగా "వ్యవసాయదారులసంఘా"న్ని నెలకొల్పజూచుట కేవలం విచ్ఛిన్న ప్రయత్నం తప్ప మరొకటికాదు. బలహీనమైయున్న జస్టిస్ పార్టీని తిరిగి బలపరచుకొనే ఉద్దేశం ఇందులో స్పష్టంగా కనబడుతోంది.

కాంగ్రెసు మంత్రులపై దాడి

రెడ్డినాయుడు నడిమంత్రపు మంత్రివర్గం రైతుల నుద్ధరించడంకోసం రీసెటిల్మెంటు రేట్లనువసూలుచేయకుండా వాయిదావేసిందనీ, రైతుల శిస్తుభారాన్ని తగ్గించబోయేసరికల్లా కాంగ్రెసు మంత్రివర్గం అధికారానికి వచ్చిందనీ; తరువాత ఆ ప్రతిపాదనలు అడుగున పడిపోయాయని, రెడ్డిగారు వాదించారు. కాని కాంగ్రెసు మంత్రివర్గంకూడా రీసెటిల్మెంటు రేట్లను వాయిదావేసిన విషయం వీరు మరచిపోయారా ? నీటితీరువా వగైరా రైతుల శిస్తుభారాన్ని తగ్గించుటకు రెడ్డినాయుడు మంత్రివర్గం చేసిన ప్రతిపాదనలను కాంగ్రెసు ఆచరణలో పెట్టిన విషయంకూడా ప్రజలు ఎరుగనిదికాదు. రైతుల ఋణభారాన్ని తగ్గించే విషయంలోను, జమీందారీ శాసనాన్ని రైతులకనుకూలంగా సవరించే విషయంలోను కాంగ్రెసు మంత్రివర్గం గావించిన కృషి జగద్విదితమే గదా ! జమీందారీ బిల్లును వ్యతిరేకించి, జమీందార్లపక్షం వాదించిన రెడ్డిగారిని ఆంధ్ర రైతాంగం యెలామరచి పోగలదు ?

కాంగ్రెసు మంత్రివర్గాన్ని వారు విమర్శిస్తూంటే, అనేక మంది కాంగ్రెసు ధనిక రైతుల్లోకూడ అసంతృప్తి వ్యాపించింది.

కొత్తపాట, కొత్తనినాదాలు

ప్రభుత్వం నిర్ణయించిన రు 11 రేటుకే రైతులుతమధాన్యాన్ని అమ్మవలసిందనీ, నిలవ వ్యాపారస్తులవద్ద ఎక్కువరేట్లు తీసుకొని అమ్మవద్దని రెడ్డిగారు సభలో హెచ్చరించారు తినుటకు అత్యవసరమైన ధాన్యాన్ని మాత్రం ఉంచుకొని, మిగతా సరుకును ప్రభుత్వానికి పంటల్లోనేఅమ్మవలసిందని సలహాయిచ్చారు. ఎరువులు, వ్యవసాయపరికరాలుకూడా రైతుల కందుబాటులో ఉండేధరలకు కంట్రోలుచేయబడాలనిసూచించారు. దీని అర్థంఏమిటి? రైతు సంఘాలప్రచారాన్ని వీరుగుర్తించక తప్పింది కాదు. ప్రజామోదాన్ని పొందే నినాదాలను వల్లించవలసి వచ్చింది. మరో విషయం ఏమంటే, వీరు ప్రభుత్వంనియమించినఎడ్వైజరీ కౌన్సిల్‌లో యిప్పుడు సభ్యులనేవిషయం మరచిపోరాదు. ఈ ఉద్యోగం రాకముందు ఒకపాట, వచ్చిన తరువాత-మరొకపాట !

దీనివల్ల రామచంద్రారెడ్డిగారు పుట్టిధాన్యం రు. 200—0—0 చేయించే (మిగతా 7వ పేజీ)

దేశభక్తులు నిరుత్సాహపడి కూర్చోవడం దేశానికి నష్టదాయకం

నామన బాపన్న (తూ. గోదావరిజిల్లా కాంగ్రెసు ప్రముఖులు, లోగడ విచ్ఛిన్న కార్యక్రమాన్ని నమ్మినవారు, 70 ఏండ్లవృద్ధులు) ఈక్రిందివిధంగా తెలియజేస్తున్నారు.

సోదరులారా !

"నేటి భారతదేశ సమస్యలు చాలా బీభత్సంగా వున్నాయి. ఒక ప్రక్క జపాను ఫాసిస్టులు భారతదేశాన్ని హరించడానికి పొంచికూర్చున్నారు, మరొకప్రక్క సామ్రాజ్యవాదులు మన నెత్తిమీద తాండవమాడుతున్నారు. మన సోదర ప్రజలు తిండి లేక వేలకు వేలు మృత్యువాత బడుచున్నారు. ఇటువంటి విపరీతసమయంలో జైళ్ళబయట వున్న కాంగ్రెసు దేశభక్తుల కర్తవ్యం ఏమిటి ?

ఈ క్లిష్టసమస్యనుంచి భారతదేశాన్ని రక్షించాలంటే, జాతీయైక్యతద్వారానే సాధ్యమవుతుంది. ప్రధాన రాజకీయపార్టీయైన కాంగ్రెసు నాయకులను విడిపించుటద్వారానే జాతీయప్రభుత్వాన్ని స్థాపించగల్గుతాం. ఈనాడు జైళ్ళ బయట వున్న దేశభక్తులం నిరుత్సాహపడి ఏమీచెయ్యలేమనే అధైర్యంతో యిండ్లలో కూర్చున్నాం. ఈవిధంగా దేశభక్తులం కూర్చోవడం దేశానికి నష్టదాయకం.

భారతదేశంలో మూడవ రాజకీయపార్టీ అయిన కమ్యూనిస్టుపార్టీ జాతీయైక్యత కొరకు, జాతీయప్రభుత్వ స్థాపనకు, జాతీయ నాయకులను విడిపించుటకు ప్రజలలో నిరంతరకృషి చేస్తున్నారు. ఈకృషిఫలితంగానే జాతీయప్రభుత్వాన్ని స్థాపించగల్గుతామనే నా నమ్మకం.

20—11—43 వ తేదీని మాగ్రామం జిల్లాకమ్యూనిస్టుపార్టీ ఆర్గనైజరు ఇనుగంటి నారాయణరావుగారు, మరికొందరు వచ్చి, జాతీయైక్యతా కార్యక్రమంలో పాల్గొనమని నాతో చర్చలు జరిపారు. ఆచర్చలఫలితంగా, యీనాడు కమ్యూనిస్టుల కృషి ఆదర్శప్రాయమైందని గ్రహించాను. నేను పెద్దవాడినయినప్పటికీ, వీరి కృషికి నాచేతనయినంతవరకూ తోడ్పడతానని వాగ్దానమిచ్చాను. సోదర దేశభక్తులందరూ కూడా ముందుకు వచ్చి, దేశరక్షణ కార్యక్రమంలోపాల్గొని, చెయ్యి—చెయ్యి కలిపి పనిచెయ్యాలని మనవి చేస్తున్నాను. ఈ ఐక్యతా కార్యక్రమం ద్వారానే నేటి భారతదేశ స్వాతంత్ర్యాన్ని, మనల నెదుర్కొన్న ఆహారసమస్యను పరిష్కరించగల్గుతాం."

ఐక్యప్రజలముందు అధికారుల లొంగుబాటు

అనంతపురంజిల్లా ఉరవకొండ తాలూకా రైతాంగమంతా మొన్నటిదాకా పంటలు లేనందున అప్పులపాలయి నానాఅవస్థలు పడింది. ఇట్టిరైతులను నిర్బంధంగా వార్ లోన్‌బాండులను (యుద్ధ ఋణపత్రాలను) కొనమని స్థానిక డెప్యూటీ తహసీల్దారు నిర్బంధించుతున్నాడు. 2 వేల జనసంఖ్యగల ఒకగ్రామంలో 50 లేక 60 వేల రూపాయల బాండ్లు కొనమని నిర్బంధించుతూవచ్చాడు. ఎవరైనా యిచ్చుకోలేమని చెపితే ఆరైతుకు సమనులు పంపి తను క్యాంపు వేసినచోటికల్లా తిప్పడం మామూలయింది. ఈపరిస్థితులలో అక్టోబరు 30 వ తేదీన రాజశేఖరరెడ్డి (జిల్లాకమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి) హావళి గ్రామరైతుసంఘానికి అధ్యక్షత వహించి, వార్ బాండ్సును గురించి రైతులు అవలంబించవలసిన దృక్పథాన్ని తెలియజేశారు. నిర్బంధంగా వసూలు చేయడాన్ని ఆపుచేయించాలి, కాని, శక్తిగలవారందరూ తమ దేశరక్షణ బాధ్యతను గుర్తించి, తమ తాహతుకు తగినట్లు వార్ లోన్ బాండ్సును కొనాలని ఉద్బోధించారు. గ్రామ రైతుసంఘం ఆమోదించింది.

కాని, నవంబరు 3 వ తేదీన డెప్యూటీతహసీల్దారు వచ్చి 65 వేల రూపాయల బాండ్సు కొనమని నిర్బంధించాడు. ఇవ్వలేమన్న రైతులవద్ద పూచీకత్తులు తీసుకొని మరొక గ్రామానికి 5 వ తేదీన వాయిదా వేశానంటూ రమ్మన్నాడు.

రైతులంతా నిస్పృహ చెందారు. ఆంధ్ర రాష్ట్రరైతుసంఘ వలంటీరు నారాయణరావు గారు, గ్రామరైతులంతా ఏకమై ఎంత యివ్వగలరో తెలియజేయమన్నారు. ఇదివరకటి తగాదాలను కూడ మాని, రైతులైక్యమయి 14 వేల రూపాయల బాండ్సు కొనగలమని చెప్పారు. 9 వ తేదీన యీ విషయం తహసీల్దారుకు తెలియజేశారు. తహసీల్దారు అంగీకరించక తప్పిందికాదు.

రైతులంతా ఈ విధంగా తమకర్తవ్యాన్ని గుర్తించి, ఐక్యమై వార్‌లోన్ బాండ్సు విషయంలో తామే చొరవతీసుకొని శక్తికొలది కొనిపించాలి. అధికారుల నిర్బంధాలకు అవకాశమే లేకుండా చేయాలి.

వార్‌లోన్ బాండ్స్ కొనడానికి రైతులు అసలే సందేహిస్తున్నారు. అలాంటి సమయంలో కొందరు స్థానిక అధికార్ల చర్యలు మరింత గందరగోళపరుస్తున్నాయి.

పశ్చిమ గోదావరిజిల్లా లింగబోయినచర్ల గ్రామంలో, 12-11-43 న కరణం మున్సబులతోకలిసి రెవిన్యూ ఇన్స్పెక్టర్ 4 గురు రైతులనుండి వందేసి రూపాయలు వార్ లోన్ బాండ్సుకు తీసుకొన్నాడు, కాని, 80 రూపాయలేసి బాండ్స్‌మాత్రం ఇచ్చాడు. తక్కినదబ్బేది ? అనిఅడిగితే జవాబులేదు. స్థానికకమ్యూనిస్టులకు యీ విషయంతెలిసి, అతనిని ఈ విషయంఅడిగారు, 'వార్‌ఫండ్' క్రిందతీసుకొంటామని రెవిన్యూఇనస్పెక్టరుజవాబిచ్చాడు. రసీదివ్వమని కమ్యూనిస్టులుకోరారు. ఆ రైతులను తీసుకువస్తే ఇస్తానని అతడు జవాబిచ్చాడు. సరేనని కమ్యూనిస్టులువెళ్లారు.

ఈలోగా స్థానికాధికారులతోగలసిరెవిన్యూ ఇనస్పెక్టరు ఒక ఎత్తువేశాడు. 20 వ తేదీన స్థానిక కమ్యూనిస్టులందరిని యుద్ధబాండుల విషయమై మాట్లాడటానికి 20 వ తేదీన నర్సాపురం రావలసిందని కోరుతూ అతడు నోటీసులు పంపాడు. అందరి తరపున ఒక కమ్యూనిస్టు నాయకుడు వెళ్ళాడు. బాండులు కొన్న రైతులను కూడ తీసుకువెళ్లాడు. "మీరంతా యుద్ధబాండులను వ్యతిరేకిస్తున్నారటకాదా ?" అని రెవిన్యూ ఇనస్పెక్టర్ ప్రశ్నించాడు. వార్‌లోన్ బాండ్సుపై సంపాదకీయంవ్రాసిన "ప్రజాశక్తి"ని చూడమని కమ్యూనిస్టు నాయకుడుజవాబిచ్చాడు. రెవిన్యూ ఇనస్పెక్టరు తెల్లమొగంవేసి, తక్కిన 20 రూపాయలకు కూడా రశీదులిచ్చాడు.

ఇలాంటిఅధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. లేనిచో వార్‌బాండ్సును కొనుటకు రైతులుముందుకు రావడం అసంభవం.

యుద్ధరంగం ప్రక్కనే ఉంది చిటగాంగ్

అక్కడే 50 వేలకుపైగా కరువుకు బలి!

— పి. సి. జోషి

నేనే చిటగాంగ్ వెళ్ళి, అక్కడి పరిస్థితుల్ని స్వయంగా తెలుసుకోవాలని నిర్ణయించుకున్నాం. అక్కడ కరువు విషమించి, ప్రజాసామాన్యం అంతా వస్తువుపడడం ప్రారంభమయి అప్పుడే ఆరుమాసాలయింది. ఈ స్థితిని అరికట్టి, తిరిగి మామూలు పరిస్థితుల్ని నెలకొల్పకపోతే నేడు చిటగాంగ్ పడుతున్న పాట్లు రేపు బెంగాల్, అపై యావద్భారతదేశం వంతు కాకతప్పదు. అంతేకాదు. చిటగాంగ్ మన తూర్పు పొలిమేరపైనున్న జిల్లా. ఫాసిస్టు దండయాత్ర సమయంలో మన కామ్రేడ్స్ అక్కడి ప్రజల మనోనిబ్బరాన్ని కాపాడకపోతే, తూర్పు బెంగాల్ జపాను ఫాసిస్టులపొట్టలో బడకుండా మనం దక్కించుకోలేము.

★

చిటగాంగ్‌కి బయలుదేరాం. స్టీమరులో అరటిపండుతిని తోలు పారవేశాను. దిక్కులేని పసిబిడ్డలు కొందరుదానిమీదికి ఈగల్లా ముసురుకున్నారు. ఎవరికి దొరికిన ముక్కను వారు గోళ్ళతోగిరిచప్పరించారు. చిటగాంగ్ పరిస్థితులు అప్పుడే అనుభవంలోకి రావడం మొదలెట్టాయి.

సెప్టెంబరు 18 వ తేదీని చిటగాంగ్ చేరుకున్నాం. మాకు స్వాగతం యివ్వడానికి వచ్చిన కామ్రేడ్స్ ఏమంత ఆరోగ్యంగా లేరు —నిస్సత్తువగా కనుపించారు. పరిస్థితులుఎలాగున్నాయని అడిగాను. "ఏమంత బాగాలేవు. మీరే చూస్తారుగా !" అని జవాబు వచ్చింది.

మకాం చేరుకున్నాం. జిల్లాలోని ప్రధాన కామ్రేడ్స్‌లో చాలమంది అక్కడున్నారు. "ఘోరం ! ఈగల్లాగా రాలి చచ్చిపోతున్నారు ప్రజలు," అన్నాడు జిల్లాకార్యదర్శి. జశోద బాబు.

"ఎంతమంది చచ్చిపోయారు ?"

"50,000 మొదలుకొని ఒకలక్ష లోపుగా ఉంటారు".

"జనాభా ఎంత ?"

"21 లక్షలు".

"అంతమంది ఎలా చచ్చిపోయారు ?" అని దిగ్భ్రమతో అరిచాను.

"అంతా చూచినట్లయితే మీరు ఇంతకన్నా ఎక్కువగానే లెక్కకడతారు. అధికారులు సంఖ్యలు ప్రకటించడంలేదు. ప్రకటించినంత వరకు మా అంచనాలను బలపరుస్తున్నాయి." అని వారన్నారు.

ఎటుచూచినా——

అధికారులు ప్రకటించిన అంకెలనడిగాను. ఒకరి తరువాత ఒకరు చెప్పుకొచ్చారు.

"చిటగాంగ్ పట్టణంలో సాధారణ ప్రజల సంఖ్య 50,000. గత 5 మాసాల్లో వీరిలో 3000 మంది చనిపోయారు."

"కుతుబ్దియాదీవి ఒకప్పుడు ఆరోగ్య కేంద్రంగా ఉండేది. జూన్, జూలై, అగస్టు మాసాల్లో అక్కడ నెలకు 500 మంది చొప్పున చచ్చిపోయారు."

"సాదర్ సబ్‌డివిజన్‌లోని 63 గ్రామాల్లోనూ సెప్టెంబరు 15 వరకు 1062 మంది చనిపోయారు."

"క్విపారాలోను, చుట్టుపక్కలగ్రామాల్లోను, జాలరి కుటుంబాలు, ఇతర వృత్తుల కుటుంబాలు కలిసి 300 ఉండేవి. వీటిలో 100 కుటుంబాలు అంతరించిపోయాయి."

నాకు ఆలోచనలే ఆగిపోయాయి.

రు. 4 నుంచి రు. 80 లకు

"చిటగాంగ్ రక్షణ" ప్రదర్శనం జరుగుతూంది. జిల్లా ముస్లింలీగ్ అధ్యక్షుడు ప్రారంభోత్సవం జరిపారు. మహాసభ నాయకులు విరాళాలిచ్చారు. కమ్యూనిస్టులు వళ్ళుదాచుకోకుండా పనిచేశారు. ఉపన్యాసాలు వినడానికి, వైజ్ఞానిక కార్యక్రమాన్ని చూడ్డానికి, 10వేల మంది వచ్చారు. కొనఊపిరితోకూడా చిటగాంగ్ రక్షణకు పాటుపడతాం—అనే శపథంతో కూడిన పాట ఆ పదివేలమందిని ఉర్రూతలూగించింది. నాని యొక్కనాట్యదళం దేశరక్షణ సందేశాన్ని నాట్యంద్వారా అందజేసింది. గాంధీజీ వచ్చినప్పుడు, కాంగ్రెసు అధ్యక్షుడుగాఉన్నప్పుడు బోసు వచ్చినప్పుడే ఇన్ని వేలమంది సమావేశమయారు. ఈనాడు దేశరక్షణ కర్తవ్యాన్ని తెలుసుకోడానికి మళ్ళీ ఇంతమందిపోగయారు. కామ్రేడ్సుఆనందానికి మేరలేక పోయింది. వచ్చిన ప్రముఖులలో చాలమందితో మట్లాడాను. ఈసంభాషణ ఫలితాన్ని కామ్రేడ్సుకు తెలిపాను.

"పార్టీ సభ్యులు కాని దేశభక్తులుకూడా మనకు సహకారం చేస్తున్నారు. చిటగాంగ్‌ని తప్పకుండా కాపాడాలని వారుకూడా అంటున్నారు. కాని వాళ్ళమనసంతా మరోవిషయంపైనుంది- బియ్యం సంపాదించడం ఎలా ? మీరు చేసిన పొరపాటు ఇక్కడేఉంది. చిటగాంగ్‌ను రక్షించుకోవాలంటే ముందుగా ప్రజలకు ఆహారం సంపాదించుకోవాలన్న విషయాన్ని మీరు స్పష్టంచేయలేదు. జపాను ఫాసిస్టులేగనకచిటగాంగ్‌లో ప్రవేశించారంటే, ఆహార సమస్య ఇంకా ప్రమాదకరమవుతుందన్న విషయాన్ని వాళ్ళలో మీరు నాటలేరు."

ఈలోగా కామ్రేడ్సిచ్చిన రిపోర్టులన్నీ పరిశీలించాను. కామ్రేడ్సుని ప్రశ్నించాను.

ఈ పరిశోధన ఫలితంగా తేలినవిషయాలు-



మన బాధ్యతలను గురించి హెచ్చరించేమరొక భయంకర దృశ్యం

బియ్యంధర 1941 డిసెంబరులో మణుగు రూ. 3½ ఉండేది. 1942 ఫిబ్రవరికి రూ. 6, మేనెలకి 8, ఆగస్టుకి 10, అక్టోబరుకి 12, డిసెంబరుకి 18, 1943 మార్చికి 35, జూన్‌కి 40, అక్టోబరుకి 80 రూపాయీలకు పెరిగింది ఈ ధర.

ప్రజాసామాన్యమంతా వస్తువడడం మార్చిలోనే ప్రారంభమయింది. గ్రామస్తులు ఇస్లు వాకిస్లు విడిచి పట్టణాలకు బయలుదేరడం మేలో మొదలయింది.

పోటీలపై పోటీలు ?

అసలే బెంగాల్ తరుగుప్రాంతం. బియ్యం కోసం బర్మామీద ఆధారపడివుండేది. అందులోనూధాన్యానికి కొరతపడ్డ జిల్లా చిటగాంగ్. చిటగాంగ్‌లో కరువు తప్పించడానికి మిగులున్న జిల్లాలనుంచి ధాన్యం తెప్పించారా అధికారులు ? లేనేలేదు. పైగా ప్రభుత్వ యంత్రానికి ఆహారంకోసం ప్రభుత్వాధికారులు, మిలిటరీకూలీలకు తిండికోసం మిలిటరీ కంట్రాక్టర్లు మార్కెట్ల కెగబడ్డారు. స్థానిక వర్తకులు, ప్రజలతోనే కాకుండా తమలో తామే పోటీపడి ఎక్కువధర లివ్వడం ప్రారంభించారు. ధరలు ఆకాశం అంట సాగాయి. అంతేకాకుండా శీతాకాలపు పంటను ప్రభుత్వోద్యోగులు డిసెంబరు - జనవరి మధ్యలోనే స్వాధీనం చేసుకోవాలనుకున్నారు. దీనితో రైతుల్లో కంగారుపుట్టింది. ఇక తిండిదొంగలు తెరవెనక్కి వెళ్ళాప - అక్కడున్నంచి ధరలను పెంచసాగారు - మణుగు 18 రూపాయీల నుంచి 35కి పెరిగింది.

పరిస్థితులీవిధంగా శృతిమించి పోతూండేసరికి జిల్లా మేజస్ట్రేటు, ప్రభుత్వాధికారులు - లీగ్ సభ్యులు - హిందూ మహాసభవారు - కమ్యూనిస్టులు కలసిఉన్న ఒక సంయుక్త ఆహారకమిటీని ఏర్పాటుచేయడానికి అంగీకరించాడు. అయితే ప్రభుత్వం చేతిలో ధాన్యం స్టాకులేదు. ధరలను కంట్రోలుచేసి, ఆరేటుకు ప్రభుత్వం ప్రజలకు సప్లయి చేస్తుంటే కంట్రోలు చక్కగా అమలులోకి రాగలదు. ఇలా జరిగే అవకాశం లేకపోబట్టి సంయుక్త ఆహారకమిటీ నిజానికి ఉచిత భోజనశాలలు, వైద్యశాలలు మొదలయినవాటిని నడిపే సంస్థగానే ఉండిపోయింది.

తిండిదొంగలు దాచినస్టాకుల్ని స్థానిక అధికారులు బయటికి తేలేకుంటున్నారు. ఈపని గ్రామ ఆహారకమిటీల వల్లనే సాధ్యం కాగలదు. గ్రామఆహార కమిటీలు బలపడడం స్థానికాధికారులకు నచ్చదు. అవి బలపడితే గ్రామ పరిపాలనకే పోటీపడతాయేమో అని వీరి పిచ్చి భయం.

నేనక్కడ ఉంటుండగా బియ్యం సంత రోజుల్లో రూపాయికి శేరు, శేరున్నరఅమ్మేది. ఇతర రోజులలో ¾ శేరుమాత్రమే. సంత పూర్తిఅయి, ఇతర తిండి దొంగల పోటీ తప్పిపోగానే, స్థానిక తిండిదొంగలు తమ రేట్లను తామే మించిపోయేవారు.

చిటగాంగ్‌లో ఆహార సంక్షోభం ఒక మహా మారణయంత్రంలాగా ప్రజాసామాన్యాన్ని నలిపి నాశనంచేస్తూంది. బెంగాల్‌లో ఇతర ప్రాంతాలలోని దృశ్యమే అక్కడా కనబడుతూంది.

సరిహద్దులోనే ఆకలిచిచ్చు

చిటగాంగ్‌లో రెండు సబ్‌డివిజన్లు సాదర్, కాక్సుబజారు. జనాభా 21 లక్షలు.

సాదర్ జనాభా 15 లక్షలు. వీరిలో అప్పుడే ఒక లక్షమంది ఉచితభోజనశాలల్లో ఉన్నారు. యూనియన్‌బోర్డు, మ్యునిసిపాలిటీ లెక్కలను బట్టి, ఒక లక్ష మందికి పైగా పొట్టపోసుకునే మార్గం ఏదీ లేదు. మరో రెండులక్షలమందితమ సర్వస్వం తరిగిపోగా రోడ్డు పనులు మొదలైనవాటిల్లోరోజుకూలీలుగా పనిచేస్తున్నారు.

కాక్సుబజారు జనాభా 6 లక్షలు. వీరిలో మూడు లక్షల మంది తీవ్రమైన కరువు పరిస్థితుల నెదుర్కొంటున్నారు. రెండు లక్షల మంది లేబరుసర్వీసులో చేరిపోయారు. అక్కడ పార్టీ లేదనే చెప్పాలి. చిన్న ఉద్యోగులందరూ లంచగొండులని చెప్పాలి. జిల్లామేజస్ట్రేటు పంపే కాస్తబియ్యం సప్లయి కూడా ప్రజలకు అందడానికి బదులు దొంగ మార్కెట్టుకి చేరుతూంది. యుద్ధరంగాన్ని ఆనుకొనివున్న ప్రదేశాలలో పరిస్థితి ఇంకా ఘోరంగా ఉంది.

నాలుగులక్షలమంది మిలిటరీ కూలీలకు ఏదో తిండి దొరుకుతూందని భ్రమపడవద్దు. వాళ్ళకిచ్చేజీతం నెలకు రు. 34; లేక రోజుకు 1 శేరు బియ్యం, 6 అణాల డబ్బులు. రెండోవిధంగా జీతం పుచ్చుకుంటే ఇంటికి నెలకొక 5 రూపాయలు పంపగలరు. దానితో ఇంట్లో వారు కొనుక్కోగలది 5 శేర్ల బియ్యంమాత్రమే. ఎంతమంది, ఎంతకాలం దీనితో కాలం గడుపుకోగలరు ? అలా కాకుండా నెలకు 34 రూపాయలు తీసుకుంటే దానితో రోజుకు రెండుపూటలు భోజనం దొరకడమే కష్టం—ఇక ఇంటి కేమిపంపగలరు ?

ఇదీ వీళ్ళ స్థితి. దీనికితోడు కంట్రాక్టర్ల కుతంత్రాలు. ఈకంట్రాక్టర్లుఅధికార్లద్వారాగాని బజార్లో కొనిగాని ఎంతో బియ్యం సేకరిస్తారు. దీనిలో అధికభాగం దొంగమార్కెట్టుకుపంపి లాభాలు గడిస్తారు. సాధ్యమైనంతవరకు కూలీలకు బియ్యం ఇవ్వకుండా చూస్తారు.

చిటగాంగ్ జిల్లా జనాభాలో నూటికి 10 మంది ధనికరైతులు, కలిగిఉన్న మధ్యతరగతివారు. వీళ్ళకు మాత్రం పొట్టనిండా తిండి దొరుకుతూంది. నూరింట60మంది అర్ధాకలితో కాలం వెళ్ళబుచ్చుతున్నారు; నూరింటఇకమిగిలిన 30 మంది ఆకలిమంటలకు ఆహుతిఅయి, మృత్యుముఖంయెదుట నిలిచిఉన్నారు.

"ఎంతమంది చనిపోయారు- ఎందరు చనిపోతారు?"

ఈ విషయాలనన్నిటిని తెలుసుకున్న తరువాత 5 రోజులపాటు గ్రామాలు చూచివద్దామని బయిలుదేరాం. ఎక్కువగా మధ్య తరగతి గ్రామాలను చూచాం. కామ్రేడ్సు స్వస్థలాలివి. ఆ గ్రామాల్లో పార్టీ చాలబలంగా ఉంది. చిటగాంగ్‌లో కాంగ్రెసు, టెరరిస్టు ఉద్యమాల నుండి పుట్టినది పార్టీ.

1920-30 రోజుల్లో విప్లవవాదిగా పనిచేసిన వారందరూ ఈనాడు పార్టీలో ఉన్నారనే చెప్పొచ్చు. మధ్య తరగతి వారందరూ మన కామ్రేడ్సుని మంచి దేశభక్తులయిన బిడ్డలుగా ఆదరిస్తున్నారు. అందువల్ల మేము చూచిన గ్రామాలు చిటగాంగ్‌లో ఉత్తమమైనవి. ఐశ్వర్యవంతంగావుండి, సంప్రదాయసిద్ధంగా దేశభక్తితోనిండిన గ్రామాలవి.

ఈగ్రామాల్లో కూడా ప్రజల మనసుల్ని ఆరాటపరుస్తూంది ఒకటే విషయం — ఎంతమంది చనిపోయారు ? ఇంకెంతమంది చనిపోతారు ?

ఉచితభోజనశాలల్లో ఒక్కదాన్నీ విడిచిపెట్టకుండా అన్నింటినీ చూచాను. అక్కడున్నవాళ్ళల్లో ఎక్కువమందికప్పుడే కాళ్ళల్లో నీరు చూపింది. ఆకలితో మాడిన ఆ అభాగ్యులు అక్కడ పోసే గంజిని గళకళం చూస్తుంటే,

నాగుండె నీరయేది. అలాంటప్పుడు పార్టీకి చెందని గ్రామపెద్ద ఎవరో వచ్చి— "ఇక్కడింకా నయం — కామ్రేడ్స్ పనిచేస్తున్నారు కాబట్టి, ఇక్కడ భోజనశాల రోజూ తెరుస్తున్నారు, బియ్యం నిరాధారులకు చేరుతూంది. తక్కిన గ్రామాల్లో భోజనశాలలు వారానికి, ఒకసారో రెండుసార్లో తెరుస్తారు. బియ్యం అంతా యూనియన్ బోర్డు అధ్యక్షుని పాతరలోకో, లేక సర్కిల్ ఆఫీసరు సంచుల్లోకో పోతుంది" — అని ఓదార్చబోతాడు.

ఈమాటల్ని విని ఒక అభాగ్య స్త్రీ అందుకుంది—"ఆనీచులదగ్గర్నుంచి పెద్దింటిబాబులు పెచ్చుధరలకు అబియ్యం కొనుక్కుపోతారు— బీదలు తిండిలేక చస్తూంటే," ప్రజాసేవకులు లేనిచోట ఎవరిబాగు వారే చూచుకుంటూ ప్రజల్ని గోతిలో తోసేస్తున్నారు.

క్విపారా గ్రామంలో తిరుగుతూండగా కామ్రేడ్స్ ఒక పాడుపడిన గుడిసెదగ్గర నన్నాపారు. కిందటినెల అయింటిలో ఉండిన ప్రతి ప్రాణి ఆకలిమంటల్లో పడి అంతరించింది. మేము చూస్తూండగా ఒక బక్కచిక్కిన కుక్క ఆగుడిసెలోనుంచి కాళ్ళీడ్చుకుంటూ బయటికి వచ్చింది. "అదిమాత్రం బతికుంది," అన్నాడు నాపక్కనున్న బాల సంఘ సభ్యుడు. ఆమాటల్లో యెటువంటి భయంకర దృశ్యం యిమిడివుందో ఆ అమాయకునికి తెలియదు.

ప్రతి గ్రామంలోనూ. చేతిపనివా రుండే ప్రదేశానికి వెళ్ళడమంటే ఇలాంటి గుడిసెలను చూడడమన్నమాటే - తమ సర్వస్వం పోగొట్టుకొని ఒంటరిగా మిగిలిపోయిన స్త్రీల గోడు వినడమన్నమాటే !

యువకులంతా గ్రామాలు విడిచిపోయారు. మధ్యతరగతి యువకులు సేనలో గుమస్తాలుగా చేరారు. కర్షక కార్మిక యువకులు నావికులుగాను, సైనికులుగాను చేరారు. లేదా విమానాశ్రయ నిర్మాణంలోను, రోడ్లనిర్మాణంలోను పాల్గొంటున్నారు. రిటైరయినవారూ, కాబోయేవారు, విద్యార్థులు మిగిలారు. ఎక్కడ చూచినా స్త్రీలు, బిడ్డలే ఎక్కువగా కనిపిస్తున్నారు.

ఈ స్త్రీల, బిడ్డల స్థితి గుండెలు కరగదీసేదిగా ఉంది. బెంగాలంతటా స్త్రీలు, బిడ్డలు దుర్భర బాధ లనుభవిస్తున్నారు. కాని చిటగంగ్‌లో వారిస్థితి ఇంకా ఘోరంగాఉంది.

బడులలో

నోపారా హైస్కూలు హెడ్ మాస్టరు తన స్కూలులో కుర్రవాళ్లందరూ చిక్కిపోతున్నారని చెప్పారు. బీద బాలురు అసలు బడికి రావడమే మానేశారట. మధ్యతరగతి బీద కుర్రాళ్ళు తరుచు పాఠాలు జరుగుతుండగా నెలవు అడుగుతున్నారట. ఎందుకని అడుగుతే సిగ్గుపడుతూ ఉదయం ఏమీ తినలేదు—క్లాసులో కూర్చోలేమని చెబుతున్నారు.

పూటభోజనం పంచుకోవాలి

మధ్యతరగతి కుటుంబాలను గురించి విచారణ చేయగా, వారిలో నూరింట పదిమంది (కలవారు)కి మాత్రమే చాలినంత బియ్యం దొరుకుతూందని తెలిసింది. విలువగల ఇతర భోజన పదార్థాల విషయంలో వీళ్లుకూడా చాల పొదుపుగా ఉండవలసివచ్చింది. నూరింట 50 మందికి రోజుకి ఒక్కపూటే పూర్తి భోజనం, మిగతాపూట కొంతప్రకారం కొద్దిగా తినవలసిందే. బిడ్డలకుమాత్రం పొట్టనిండా తిండి పెడతారట. మిగతాది అంతా పంచుకుంటారు.

మధ్యతరగతి బీదల్లో నూరింట 50 మంది (ముఖ్యంగా స్వంతపొలాలనుంచి ఆదాయంలేని వారు) రోజుకి ఆఒక్కపూట భోజనంకూడా పంచుకోవలసిందే. రెండోపూటను గురించి మీనమేషాలు లెక్కపెట్టవలసిందే.

ఈ కుటుంబాల్లో పార్టీకి చాల బలంఉంది. ఆ కుటుంబాల స్త్రీలు మహిళాసంఘంద్వారా ఉచితభోజనశాలల్లో పనిచేస్తున్నారు. కొన్ని కుటుంబాల్లో తల్లులు, ముసలవ్వలు దళాలుగా వెళ్ళి ఉచితభోజనశాలలకు ముష్టిభిక్షుదండుకున్నారు.

స్వయంసహాయమే

అన్నిసమస్యల పరిష్కారానికిమార్గం

●

ఒక 78 ఏళ్ళ అవ్వ తన మనవరాళ్ళతో పాటు తానూ పార్టీలో చేరింది. ఆమె నాతో చెప్పింది—

"మీరంతా స్వార్థత్యాగంతో, వళ్లు దాచుకోకుండా పనిచేస్తారు. మీరే బియ్యం తెచ్చిపెట్ట లేకపోతే ఇంక దారేది ?"

"అది దిగజారుడు వాదన. బియ్యం కావాలంటాను - కాని, దానికోసం పనిచేయరు." అని నేను జవాబు చెప్పాను.

"వాళ్ళకు తెలియదు. ఎలా బియ్యం సంపాదించడమో. మేమూ మార్గం చూపలేకపోతున్నాం" అంది అవ్వ.

మధ్య తరగతి కుటుంబాల మనోవైఖరి అంతా ఇంచుమించు ఇదే.


అన్నంకోసం——

ఈవేళ దేనినిగురించి చర్చించారని ఒకనాడు అడిగాను. "రెడ్ క్రాస్ సంస్థద్వారా బియ్యం పంపుతామని జపానువారుచేసిన ప్రకటననుగురించే" అని జవాబు వచ్చింది. నేను చూచిన ఘోరదృశ్యాలకన్నా యీ మాటలు నన్ను కదల్చివేశాయి. ఈ వైఖరిలో పన్న అని అడిగాడు. కొంత మాట్లాడిన తరువాత అంతా అర్థమయింది. ఆగ్రామం తిండికోసం చిటగాంగ్ వైపు కనిపెట్టుకొని ఉంది. చిటగాంగ్ కలకత్తామీద ఆశనిలిపింది. కలకత్తా యావద్భారత దేశంవైపు చేతులు చాచింది. కలకత్తాలోని జాతీయ దినపత్రికలు మధ్య తరగతిని మానసికంగా ఈ దీనస్థితికి తీసుకువచ్చాయి. బెంగాల్‌లోని తిండిదొంగను తెర వెనుక దాచిపెట్టి, సహాయంకోసం ఇతరులకు విజ్ఞప్తులు ప్రారంభించాయి; స్వశక్తిని ప్రజ్వలింపజేసి, స్వయం సహాయానికి బెంగాల్ ప్రజల్ని ఉద్బోధించడం మందుకైనా కనబడలేదు.

ధల్ఘాట్‌లో నా ఉపన్యాసం పూర్తికాగానే ఒకాయనలేచి ఇలా అడిగాడు :

"తిండికోసం ఏకంకమ్మంటారు—ఇక్కడ ఆహారపదార్థా లుంటేగా ? అంతా ప్రభుత్వం తీసుకుపోయింది. దానిని ఎలా తెచ్చుకోవడమో చెప్పండి."

"మీ గ్రామంలో తిండి లేదనడం పొరపాటు," అని జవాబుచెప్పాను. "మీగ్రామంలో



బెంగాలుకి సత్వరసహాయం చేయకపోతే నేడు ఈ బిడ్డకు పట్టినగతి రేపు——

ప్రజ రేపు బోసువస్తే అతనిపక్షం చేరకుండా ఉంటారా ? అలా ఎప్పుడూ జరగదన్నారు కామ్రేడ్స్. నిరుడు బాంబులుపడ్డ దగ్గర్నుంచి చేసిన ప్రచారం ఫలితంగా ప్రజ లెన్నటికీ అలాచేయరన్నారు.

"పట్టె డన్నంకోసం ఒక యువతి తన శీలాన్ని అమ్ముకోగలిగితే-ఒకతల్లి తనబిడ్డను వదులుకోగలిగితే— ఒక అన్న తన చెల్లెల్ని మెడబట్టి గెంటివేయగలిగితే — బోసు బర్మా బియ్యంతో వచ్చినప్పుడు ఈప్రజలు స్వాగతం ఇవ్వడంలో ఆశ్చర్య మేముంటుంది ? మనం పరిస్థితుల్ని పూర్తిగా సరిదిద్దకపోతే, ఎక్కువగా బియ్యం తెప్పించకపోతే, ప్రజల్ని రోజురోజుకు ఉత్తేజపరచకపోతే, ఈఘోరం తప్పకుండా జరుగుతుంది. తిండికోసం ప్రజలందరిలోను కార్యదీక్ష కలిగించాలి — తిండి దొంగల్ని ప్రజ అందరూ ప్రతిఘటించేలా చేయాలి.

కామ్రేడ్స్ ! మీరు ఆకలి మంటలనే చూస్తున్నారు. వాటి ఫలితంగా మనోనిబ్బరం సన్నగిల్లడం చూడకుంటున్నారు." - అని కామ్రేడ్సుని హెచ్చరించాను.

స్వయం సహాయం

క్విపారాలో ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొన్నాను. అక్కడ ఉపాధ్యాయులు, రిటైర్డు ఉద్యోగులు మొదలైనవారు కొందరు నా దగ్గరకు వచ్చారు. వాళ్ళలో పెద్ద చేతులు జోడించి, "తిండివచ్చే మార్గం చూపిస్తారా?" దొంగతనంగా బియ్యంఅమ్మటంలేదూ? తిండి దొంగలు మీగ్రామంలో ఉంటంలేదూ? అతన్ని మీరేంచేశారు ? మీ ప్రాంతాల్లోని జమీందార్లు తమ మధ్యతరగతి బంధువుల కేమాత్రం సాయంచేశారు ? అసలు మీలోనే ఎందరు - ఎంతమట్టుకు ఉచిత భోజన శాలలకు సాయంచేశారు ? మీరేగాని ఇదంతా చేయగలిగితే, మీ ప్రజల్ని మీరు కాపాడుకోవడం మాత్రమేకాదు— ఈ ప్రభుత్వం మీ తిండితో ఇష్టంవచ్చిన ఆట ఆడకుండా అరికట్టగలశక్తి మీకు కలుగుతుంది.

మీ కళ్ళ ఎదుట బాధపడుతున్న వారిపట్ల ముందు మీ బాధ్యతల్ని నెరవేర్చండి. మీ గ్రామంలోని తిండిదొంగల్ని పట్టండి — వారి దొంగ వ్యాపారాన్ని అరికట్టండి. ఎవరి ప్రాంతాల్లో వారలాచేస్తే దేశంలోని పెద్ద దొంగల ఆటలు, ఆగిపోతాయి. జాతీయప్రభుత్వం ఏర్పడగలదు. మన సమస్యలన్నీ తీరగలవు. అసలు మనజాతికే ఒక కొత్తవన్నెవస్తుంది. బెంగాల్‌లోకరువుతెచ్చిపెట్టిన విదేశప్రభుత్వం ఢిల్లీని ఖాళీచేయకతప్పదు - మనజాతి రక్షణ కొరకు జాతీయప్రభుత్వం గద్దెనెక్కగలదు." అని జవాబు చెప్పాను.

ప్రజాసేవలో ప్రాణాలర్పించిన రేవతిదాస్ కుటుంబానికి నా జోహారులందజేయడానికి ఆ సాయంత్రం వెళ్ళాను. నన్ను సభలో ప్రశ్నించింది అతని అన్నే. నాకు ఆశ్చర్యంవేసింది. తన తమ్ముని స్మారక చిహ్నంగా తన భూమిలో కొంత భాగంనుంచి వచ్చే పంటనంతా, కాలపరిమితిలేకుండా, పార్టీ కతనిచ్చేటప్పుడు నా ఆశ్చర్యం ఇంకా హెచ్చింది. ఆహారసమస్యా పరిష్కారానికి చేయూతనిచ్చాడు. ఈ స్వయం సహాయ సూత్రాన్నే అన్నిచోట్లా ప్రచారంచేశాను.

"ఠాగూరు, దేశబంధుల పుట్టినిల్లు—బెంగాలుని, భారతదేశం మృత్యువువాత పడనివ్వదు. బెంగాలుని రక్షించుకోవడం అంటే దేశంలోని ప్రతిరాష్ట్రాన్ని కరువు నుండి, ఫాసిస్టు దాస్యంనుంచి, రక్షించుకోవడ మన్నమాట. చాపునుంచి తప్పించుకొని బ్రతకాలి. స్వయంసహాయం ద్వారా కావలసిన వ్యవధిని సంపాదించండి-అదిచేస్తే చిటగాంగ్ ఇక చావదు."

తరువాత

ఈసందేశంఇచ్చి కలకత్తా తిరిగివచ్చాను. అప్పుడే బోసు మొట్టమొదటచిటగాంగ్‌మీదికి వస్తానని రేడియోలోబెదరించాడు. పరిస్థితుల్ని చక్కబెట్టడానికి వ్యవధిఉంటుందా ? ఇంతలో చిత్తప్రసాద్ శుభవార్తలతో వచ్చాడు. అన్నిచోట్ల స్వయంసహాయ సూత్రంమీద ఐక్య కార్యక్రమం ప్రారంభమయిందని తెలియజేశాడు. ధల్ఘాట్‌లో పూజా సందర్భంలో సంయుక్త పూజాకమిటీ ఏర్పడింది. అందరూ యిచ్చిన విరాళాలతో 1200 మంది హిందూ—ముస్లిం బీదలకు అన్నదానం జరిగింది. ప్రజా ఆహారకమిటీ కార్యదర్శి పూర్ణేందు— "ఈనాడు బీదలను కాపాడడమంటే, రేపు మధ్యతరగతిని కాపాడడమన్నమాట." అని యిచ్చిన సందేశంపైని పాలు, బియ్యం, డబ్బు నెలసరి విరాళాలు వాగ్దానం వచ్చాయి.

తిండిదొంగలపై దాడి

ప్రజల రక్తంతోను, సోదరీమణుల శీలంతోను, పసిపాపల ఆక్రందనలతోను బేరాలాడే కటికికసాయివారు తిండిదొంగలు. చిటగాంగ్ యింతవరకు వీళ్ళను సహించింది. ఇకసహించలేదు; మన కామ్రేడ్స్, యితర దేశభక్తులతో కలిసి తిండిదొంగలపై దాడికి కార్యక్రమం వేశారు.

అక్టోబరుమాసంలో ఒక నాడు రాత్రి కుమరా గ్రామం దగ్గర 192 మణుగుల బియ్యంతోపోతూన్న 21 బళ్ళను ప్రజారక్షణ వలంటీర్లు అడ్డగించారు. కొద్దిసేపటిలో హిందువులు,ముస్లింలు అంతా ఆబళ్ళను చుట్టవేశారు. కాని, తిండిదొంగలు సామాన్యులు కారు. కొద్దిగంటల్లో సబ్‌డివిజనల్ ఆఫీసరు దగ్గర్నుంచి హుకుంవచ్చింది—బళ్ళనుపోనివ్వమని. ఏమిటీ అన్యాయం అని అడిగితే జిల్లా మేజిస్ట్రేటు విచారణచేస్తానన్నాడు.

బాలబాలికలుకూడా

కుమరాలోని బాలసంఘంకూడా తిండి దొంగలను తీవ్రంగా ద్వేషిస్తూంది. తిండి దొంగలను పట్టే ఏర్పాట్లు వాళ్లు చేశారు. దొంగను పట్టగానే — వాడిదగ్గరకువెళ్ళి— "నువ్వు మనిషివికావా — నీ ఎదుట ప్రజలిలా చచ్చిపోతుంటే ఇంత ఘాతుకానికి ఒడికట్టగలవా;" అని ఆకసాయి గుండెకూడా కరిగేలాగా బోధిస్తారు. ఈవిధంగా ఒక్కవారంలో బాలబాలికలు 5 మణుగుల ధాన్యం సేకరించారు.

ధనిక - బీదరైతులు

రైతుల్లో దేశభక్తిని రేకెత్తించడంసులభం. జపాను హంతకులు పొలిమేరమీద ఉంటుండగా బియ్యం దాయడం ఘోర అపరాధం అని ఒక మీటింగులో ఒక కామ్రేడ్ చెప్పేసరికి హిందూ, ముస్లిం రైతుసోదరులు 25 మణుగుల ధాన్యంతెచ్చి ఆహారకమిటీకి కంట్రోలు రేటుకు అమ్మారు.

కాని ముగ్గురు ధనికరైతులు ఒప్పుకోలేదు. వెంటనే గ్రామస్తులందరూ వాళ్ళను బాయ్‌కాట్ చేశారు. వాళ్ళ ఇళ్ళకు వలంటీర్లను కాపలా ఉంచారు. వాటిలో ఒక ఇంటికి రాత్రిపూట కొందరు బళ్ళవాళ్లువచ్చి 124 శేర్ల ధాన్యం పట్టుకువెళ్లారు. వాలంటీర్లు వాళ్ళను ఆపారు. గ్రామస్తులు (మిగతా 8 వ పేజీలో)

కార్మికుల సొమ్మును కాజేశారు

రాజమండ్రి రైల్వేయూనియన్ పాత అఫీసు బేరర్ల మోసం

యం. యస్. యం. రైల్వే కార్మిక సంఘ రాజమండ్రి బ్రాంచి కార్యదర్శి యీ దిగువ ప్రకటన పంపారు:

నవంబరు 10 వ తేదీన ఆంధ్రప్రభ పత్రికలో యం. యస్. యం. రైల్వే పనివారల యూనియన్ రాజమండ్రి బ్రాంచి యొక్క ప్రస్తుత కార్యనిర్వాహకవర్గంపై అబద్ధపు రిపోర్టు ఒకటి వెలువడింది. "ప్రముఖనాయకులు" అయిన పాత కార్యనిర్వాహకవర్గ సభ్యులపై నూతన కార్యనిర్వాహకవర్గం డిసిప్లినరీచర్య అక్రమముగా తీసుకొన్నదనీ, ఆ అక్రమ చర్యను నిరసిస్తూ బ్రాంచి అంతటా అనేకచోట్ల మీటింగులు జరుపబడినవని పై రిపోర్టు తెలుపుతుంది.

రాజమండ్రి బ్రాంచి యూనియన్‌లోని నిజ పరిస్థితులను తెలుసుకోవలెనంటె, పాతఆఫీసు బేరర్లు, తాము కార్యవర్గంలోవున్న $2\frac{1}{2}$ సంవత్సరాలపాటు అంటే, 1941—42, 42—43 సంవత్సరాలలో, యూనియన్ ఫండ్సు విషయంలో యేవిధంగా వ్యవహరించినది మనం తెలుసుకోవలెను. ఈరెండున్నరసంవత్సరాలపాటు పాత కార్యవర్గంలో వైస్‌ప్రెసిడెంటుగా పున్నారెడ్డి, కార్యదర్శిగా కన్నప్పన్, అసిస్టెంటు కార్యదర్శిగా యం. వి. సుబ్బారావు, కోశాధికారిగా అప్పలకొండ వుంటూవచ్చారు. యూనియన్ కాన్‌స్టిట్యూషన్ ప్రకారం బ్రాంచీలలో ప్రతినెలా జరుగు కార్యనిర్వాహకవర్గ సభల్లో జమా ఖర్చుల అక్కౌంటు స్టేటుమెంటులను అప్రూవుచేయించి, వాటికాపీలను కేంద్ర కార్యనిర్వాహకవర్గానికి ప్రతినెల పంపుతుండడం, ప్రతినెల వసూలగు సభ్యత్వ రుసుం తాలూకు డబ్బును బ్యాంకులో వేయటం, ఆఫీసు బేరర్లు చేస్తూండాలి. అలాంటిది పాత ఆఫీసు బేరర్లు యూనియన్ ఫండ్సును బ్యాంకులో వేసిన పాపానగాని, అకౌంట్లు తయారుచేసి, కార్యనిర్వాహకవర్గ సమావేశాలచేత అంగీకరింపజేసినపాపానగాని పోనేలేదు. కార్యవర్గంలోని మిగతా సభ్యులను అమాయకులనుగా అట్టేపెట్టి, ఎంతెంత సభ్యత్వరుసుము వసూలు అగుచున్నది, ఎంత ఖర్చు అగుచున్నది హెడ్ ఆఫీసునుండి యేమేమి సర్క్యులర్లు వస్తున్నవి, వారి కేమి తెలుపకుండా మొత్తం కమిటీని తమ అభీష్టాలకు అనుకూలంగా నడుపుతూ వచ్చారు. మొదటి సంవత్సరం ఫండువిషయంలో వారు అనుసరిస్తున్న దగా ప్రవర్తనను అనుమానిస్తున్నప్పటికి, యెవరూ ఏమీప్రశ్నించకుండానే సాగిపోయింది వారు ఆఫీసు బేరర్సుగాఉన్న రెండవ సంవత్సరంలో. ఆ సంవత్సరంలో సెంట్రల్ కౌన్సిలు సభ్యుడుగా ఉంటున్న కె. నమ్మయ్య, ప్రస్తుత బ్రాంచి కోశాధిపతిగా నున్న ఆర్. ఎ. వి. సత్యనారాయణ, పి. జానకీరామశర్మగార్లు వారంరోజుల టైమ్‌తోటి అక్కౌంట్సు తనిఖీచేయడానికి పాత కార్యదర్శికి నోటీసులను యిచ్చారు. ఆనోటీసులను ఆయన కమిటీయెదుట పెట్టనేలేదు. నోటీసులను యిచ్చినవారికేమీ సమాధాన మివ్వనేలేదు.

ఇంతేకాకుండా కార్యనిర్వాహకవర్గ సభ్యులు కొంతమంది పట్టుబట్టి 18—11—42 తేదీన కమిటీ మీటింగు జరుగుతుందని కార్యదర్శిచేత నోటీసుయిప్పించారు. కాని ఆమీటింగునకు మిగతా సభ్యులుతప్ప ఆఫీసు బేరర్లు ఎవరూ హాజరుకాలేదు. హాజరు అయినవారే, లెక్కలను తరువాత జరుగు కమిటీ మీటింగులో చూపవలసినదని కార్యదర్శిని కోరుతూ తీర్మానించారు. ఈ తీర్మానంమీద వెంటనే కార్యదర్శి, సహాయ కార్యదర్శి రాజీనామాలను యిచ్చారు. ఆతరువాత మీటింగులో వీరిచేత రాజీనామాలను ఉపసంహరింపజేసి, లెక్కలను తనిఖీచేయడానికి యిద్దరితో ఒక కమిటీని నియమించింది. వీరు యెన్నిసార్లు కోశాధికారి, కార్యదర్శుల వెంటబడినా యీ ఆఫీసు బేరర్సు అక్కౌంట్సును వారికివ్వనేలేదు. వీరిద్దరికంటె బాధ్యులైన వైసుప్రెసిడెంటు పున్నారెడ్డిగారుకూడ కార్యదర్శిని, కోశాధిపతినిఒత్తిడిని చేసియిప్పించలేదు ఈవిధంగా ఫలానివారు లెక్కలను తనిఖీ చేయాలన్న కమిటీ తీర్మానాన్ని ఆఫీసుబేరర్లు బుట్టదాఖలు చేశారు.

యూనియన్ సెంట్రల్‌ఆఫీసువారు బ్రాంచి కార్యదర్శికి, బ్రాంచి అకౌంట్సును హెడ్‌ఆఫీసుకు పంపించమని వుత్తరాలమీద వుత్తరాలు యెన్నోతడవలు వ్రాశారు. ప్రధానకార్యదర్శి వైస్‌ప్రెసిడెంటుకుకూడ అకౌంట్సును పంపించమని 17—8—43 వ తేదీన టెలిగ్రాం యిచ్చాడు. బ్రాంచి ఆఫీసునుండి సెంట్రల్ ఆఫీసుకు జవాబు రానేలేదు. ఎనుబోతుమీద వాన కురిసిన తంతు అయింది. ప్రధానకార్యదర్శి స్వయంగా బ్రాంచి అకౌంట్సును తనిఖీ చేయటానికి రాజమండ్రి వచ్చాడు. మూడు రోజులపాటు బ్రాంచి ఆఫీసులో ఆఫీసు బేరర్లను పట్టుకొని అకౌంట్సు తేల్చుకొనుటకు మకాం వేశాడు. కార్యదర్శి ఆమూడురోజులపాటు ఆఫీసువైపునకే రాలేదు. కోశాధికారి కార్యదర్శి లేడని వెళ్ళిపోయినాడు. వైసుప్రెసిడెంటు, తాను అకౌంట్సు విషయంలో కార్యదర్శిని అడుగుతున్నానంటూ కబుర్లు చెప్పి వెళ్ళిపోయాడు. ఈవిధంగా బ్రాంచి ఆఫీసును ప్రధాన కార్యదర్శికి ఒప్పగించి యెవరిదారిని వారు దాక్కున్నారు.

బ్రాంచి కాన్ఫరెన్సు 3—10—43 వ తేదీన జరిగింది. యూనియన్ ఫండ్సు కుళ్ళు అంతా యెక్కడ బయటపడుతుందోనని, కాన్ఫరెన్సును జరగకుండా చేయాలని ఆఫీసు బేరర్లు ప్రయత్నం చేశారు. మిగతా కమిటీసభ్యులు వారిమీద యెంతో ఒత్తిడిచేసి, కాన్ఫరెన్సును జరపటానికి నిర్ణయించేటట్లు చేశారు. కాన్ఫరెన్సులో కార్యదర్శి రిపోర్టులేదు. అకౌంట్సు స్టేటుమెంటును కాన్ఫరెన్సులో పెట్టనేలేదు. ప్రతినిధులు చాల అసంతృప్తి చెందారు. 19—10—43 వ తేదీకల్లా బ్రాంచిఅకౌంట్సును తనిఖీచేసి, బ్రాంచి కమిటీకి రిపోర్టు యివ్వవలసినదిగా నిర్ణయించి, 5 గురితో ఒకకమిటీని కాన్ఫరెన్సు నియమించింది. పాత కార్యదర్శి యీకమిటీకి కొన్ని చిత్తుకాగితాలమీద కాన్ఫరెన్సు ముందుగా రాసిపెట్టిన కొన్ని అవకతవక లెక్కలను, సభ్యత్వపు రశీదు పుస్తకాలను అప్పగించాడు. 100 రశీదుల చొప్పున వుండే నెం. 29, 35 పుస్తకాలు; రిజర్వు ఫండు తాలూకు రు. 1 రశీదుపుస్తకాలు నెం. 2, 3, 6; రు. 0—8—0 రశీదు పుస్తకాలు నెం. 1, 3, 6, 7, 16, (ఒక్కొక్క పుస్తకానికి 25 రశీదులు); ఆఫీసు రికార్డ్సులోలేవు. వీటిని ఆధారంచేసుకొని కాన్ఫరెన్సులో నియమించబడినకమిటీ లెక్కలను తనిఖీచేసింది. తనిఖీ చేయగా తేలిన లెక్కలు:

రిజర్వు ఫండు	రు.	1211— 6—3
యూనియన్ చందావసూళ్ళు		805 10—5
		2017— 0—8
మొత్తం ఖర్చు		1060— 0—6
నిల్వ		957— 0—2

రు. 1060—0—6 ఖర్చుకుగాను రు. 450 రూపాయలకే ఓచర్సుఉన్నవి. మిగతా మొత్తానికి ఓచర్లు లేనేలేవు. ఖర్చును చూపెట్టిన లెక్కలలో అనేక దొంగలెక్క లున్నాయి. ఈనిల్వడబ్బురూ 957/ గురించి పాత కార్యదర్శి, కోశాధిపతులను అడుగుతే రశీదులు లేవని, సంతకాలు లేవని ఒకరిమీదఒకరు నేరాన్ని మోపుకొంటూ బాధ్యతను వదిలించుకోవాలని చూస్తున్నారు. పాత వైసుప్రెసిడెంటు పున్నారెడ్డి యీఅక్కౌంట్సు జోక్యమే వదిలించుకొన్నాడు. పాత ఆఫీసుబేరర్లందరూ కలసి యూనియన్‌కు చక్కగాబురదపూశారు. కష్టజీవులైన వర్కర్సు డబ్బును అపహరించారు. బ్రాంచి కాన్ఫరెన్సుముందుగా పాత కార్యదర్శి రు.100 తీసుకున్నాడు. వీటికికూడా యెంత అడుగుతున్నా అక్కౌంట్సు యివ్వడమేలేదు. దీనికిగాను నూతన కార్యనిర్వాహకవర్గంవారు సమావేశమై, యూనియన్‌డబ్బును యీవిధంగా తస్కరించినందుకు పాత ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సహాయ కార్యదర్శి, కోశాధికారి 5 సంవత్సరాల వరకు బాధ్యత స్థానాలకు యెన్నుకోబడకూడదని డిసిప్లినరీ చర్యతీసుకున్నారు. కమిటీ అంతటికి వైస్‌ప్రెసిడెంటుగానున్న పున్నారెడ్డి యీ చరిత్ర అంతా తెలిసివుండికూడా, బ్రాంచి కమిటీచేత ఒత్తిడి తెప్పించి అరికట్టలేదు. సెంట్రల్ ఆఫీసుకుతెలియపర్చనేలేదు. సెంట్రల్‌కౌన్సిల్ సమావేశాలలో తన బ్రాంచి డబ్బువిషయాన్ని గురించి యెత్తేవారేకారు. కనుక యీ డబ్బు వ్యవహారానికి తప్పనిసరిగా అతడుకూడా బాధ్యుడే.

కార్మికవర్గానికి వీరుచేసిన ద్రోహం ఇంతటితో ఆగలేదు. డబ్బుసమస్య తేలేంతవరకు యూనియన్‌లో చేరవద్దని వర్కర్సులో ప్రచారం చేస్తున్నారు.

ఈవిధంగా యీ బూటకపు "ప్రముఖ నాయకులు" కార్మికులకు యేకైక ఆయుధమైన యూనియన్ను బలహీన పర్చటానికి కృషిచేస్తున్నారు. వీరు మరియొకసన్నాగాన్ని పన్నారు. బ్రాంచిలో అనేకచోట్ల మీటింగులు జరిపి బ్రాంచి కమిటీ చర్యను నిరసించినట్లు పత్రికలో ప్రకటించారు. ఇంతకంటె అబద్ధం మరియొకటి వుండదు. మీటింగులు జరగనేలేదు.

పాత వైస్‌ప్రెసిడెంటు, కార్యదర్శులు తమ బ్రాంచి కమిటీ ఆఫీసును అయ్యవార్లంగారినట్టిల్లులాగచేసి అప్పగించారు. సభ్యత్వం నాస్తి. డబ్బునాస్తి. నూతన కమిటీ రాగానే రెండునెలల్లో 400 సభ్యత్వాన్ని చేర్పించింది. ప్రతినెలా అకౌంట్సును, కమిటీ సమావేశాలలో అంగీకరింపజేసి, ఒక కాపీ హెడ్‌ఆఫీసుకు పంపించి, మరియొక కాపీని అందరూ చూచుకొనేందుకుగాను ఆఫీసునోటీసుబోర్డులో అంటిస్తున్నది. కార్మికుల హక్కులు అంగీకరింపబడేందుకు గ్యాంగు సెక్షన్లలో- ముఖ్య కేంద్రాలల్లో రోజువారీ కృషిద్వారా కార్మికులను సమీకరించ నిర్ణయించుకుంది.

పంటచేను రొద

(నట్టనడిసంద్రాన నావపై నున్నాను — మాదిరి)

పచ్చపచ్చగ పెరిగి
పండి ఒరిగున్నాను
ప్రజకు నన్నందించరావా
నా రైతా
ప్రళయమా కరువాపలేవా? ప॥
కార్తీకమాసాన
కరువంత భరియించి
కళ్ళుపూసి నిలిపియున్నా
నా రైతా
కష్టజీవుల గావలేవా? ప॥
కొత్త పంటొస్తేను
కూటికరువేమిటని
కొండంత యాశతోనున్నా
నారైతా
కూలీల బ్రతికించలేవా? ప॥
ధరలు పెరిగినవంటూ
ధనిక వర్తకులంత
దరికిరా, ధాన్యమమ్మితివా
నా రైతా
దాతవను బిరుదు చెడిపోదా? ప॥
నేపండి నాపనిని
నెరవేర్చుకొన్నాను
నీదు కర్తవ్యమును నీవూ
నా రైతా
నిలుపుకొన ముందునకు రావా? ప॥

— సుంకర సత్యనారాయణ

(5 వ పేజీ తరువాయి) అంతా వచ్చారు. అంతా నచ్చజెప్పగా బళ్ళవారూ, రైతులు ఆధాన్యాన్ని కంట్రోలు రేటుకు ఆహారకమిటీకి అమ్మడానికి అంగీకరించారు.

అనేక గ్రామాలలో సమావేశాలు జరుగుతున్నాయి. హిందువులు, ముస్లింలు, తాలూక్దారులు, రైతులు - అంతా ముందుకువచ్చి శీతకాలపు పంటను ఆహారకమిటీకే అమ్మడానికి ప్రతిజ్ఞ తీసుకుంటున్నారు.

నా హృదయం పొంగింది.

మళ్ళీ బాంబులు

బొంబాయి చేరేసరికి చిటగాంగ్‌మీద రెండుసార్లు బాంబులు పడ్డాయి. ఈదఫా బాంబింగు చాల తీవ్రంగా జరిగింది; ప్రజల మనోనిబ్బరం చాల అడుగంటిందని మనోరంజన్ వార్త పంపాడు. బియ్యం మణుగు 80 రూపాయలు అమ్ముతూందనికూడా తెలిపాడు.

గతసంవత్సరం చిటగాంగ్ ప్రజానీకం చెక్కుచెదరకుండా జపాను బాంబుల్ని ఎదుర్కొన్నారు. కాని, ఈసంవత్సరం తిండి కరువు యీధీరుల్ని కుంగదీసింది. స్వయం సహాయ ఉద్యమం ద్వారా కామ్రేడ్స్ సాధిస్తున్న నిర్మాణ ఫలితాలకన్నా త్వరగానే ప్రజల మనోనిబ్బరం సన్నగిలుతూందన్న విషయం స్పష్టం.

మార్చినుంచి ప్రజాసామాన్యంలో వస్తులు—బియ్యం అంతా తిండిదొంగల చేతిలో ఉంది—శీతకాలపు పంటకు యింకా రెండునెలలు ఆలస్యం — ఈలోగా నెత్తిమీద జపాను బాంబులు—సరిహద్దుమీద బర్మాబియ్యం ఇస్తానంటూ బోసు!

చిటగాంగ్ దేశభక్తియుత చరిత్ర జగత్ప్రసిద్ధము. ఈనాటి చిటగాంగ్ సంతతి చిటగాంగ్‌ను కాపాడుకోగలదా?

ఈప్రశ్నకు సమాధానం మనమీద కూడా ఆధారపడి ఉంది. ఎంతత్వరగా, ఎంత అధికంగా బెంగాలుకు బియ్యం పంపగలం అన్న విషయంమీద ఆధారపడిఉంది. మృత్యువుకు, భయంకర జాడ్యాలకు ఎదురీత యీదుతున్నారు చిటగాంగ్ కామ్రేడ్సు.

మనం ఏమిచేస్తున్నాం? ఆ కామ్రేడ్సు కార్యదీక్ష విఫలమైందంటే మనం కలకాలం సిగ్గుతో తలవంచుకోవలసిందే!

గమనించండి

"ప్రజాశక్తి" పత్రికకు చందాలు, ఏజన్సీ బాకీలు పంపేవారుగాని, ప్రజాశక్తి ప్రచురణలకోసం డబ్బుపంపేవారుగాని, రాష్ట్రకమిటీకి పంపేవారుగాని, తమ మనియార్డర్లన్నీ "మేనేజరు, ప్రజాశక్తి" అనే అడ్రసుకు చేయాలి. వ్యక్తుల పేరుతో పంపనవసరంలేదు. వ్యక్తుల పేరుతో పంపడంవల్ల వారు ఆసమయానికి వూళ్ళోలేకపోవడం జరుగుతోంది. దీనివలన అనవసర ఆలస్యం, చిక్కు కలుగుతోంది. క్రింద కూపనులోమాత్రం ఆ డబ్బు యెందు నిమిత్తం పంపేది వివరంగావ్రాయాలి. పంపేవారి పేరు, అడ్రసుకూడా క్రింద కూపనులో వ్రాయాలి.

★ యుద్ధ సమీక్ష

వైట్‌రష్యాలో జర్మన్ల పలాయనం

నవంబరు 26 వ తేదీన సోవియటు సైన్యాలు గోమెల్‌ను వశపరచుకొన్నాయి. గోమెల్ వైట్‌రష్యాలో మంచి పారిశ్రామిక నగరమేగాక, ముఖ్యమైనకూడలిస్థలం కూడా. ఒకవైపు లిథూనియాకు, మరోవైపు పోలండుకు గోమెల్ నుండి రైలుదార్లున్నాయి. లెనిన్‌గ్రాడ్—ఒడెస్సా ముఖ్యరైలు మార్గానికి కలిపే మరొక రైల్వేలైను కూడా గోమెల్ నుండి బయలుదేరుతుంది. గోమెల్ దుర్గాన్ని దిట్టంగా బలపరచుకొని, తమ రక్షణ శ్రేణిలో దీనికి మంచిస్థానం ఇచ్చారు నాజీలు. ఇపుడు గోమెల్ రెడార్మీ వశం అవడంతో, ఇటు యుక్రైన్‌లోని జర్మన్ సేనలకు అటు వైట్‌రష్యాలో యుద్ధం చేస్తున్న జర్మను సేనలకు పూర్తిగా సంబంధం తెగిపోయింది.

సోవియటు సైన్యాలు ష్లోబిన్‌వైపుకు పురోగమించుతున్నాయి. ష్లోబిన్, లెనిన్‌గ్రాడ్—ఒడెస్సా రైలుమార్గమూ, గోమెల్ నుండి మిన్స్కు (వైట్‌రష్యా రాజధానీ నగరం)కు పోయే రైలుమార్గమూ కలిసేచోట వుంది. గోమెల్ యుద్ధంలో వలెనే ష్లోబిన్‌ను ప్రక్కవాటుగాదాటి ముట్టడించ ప్రయత్నించుతున్నాయి సోవియట్ సైన్యాలు. అప్పుడే ష్లోబిన్‌కు నైరుతిగా 15 మైళ్ళలోకి రెడ్ ఆర్మీ వచ్చింది. మరొకప్రక్క 25 మైళ్ళలోకి సోవియట్ సైన్యాలు వచ్చాయి.

గోమెల్ ప్రదేశంలోని మరొక సైన్యం మోజిర్‌ను సమీపించుతూంది.

నాజీశ్రేణిఛిన్నాభిన్నమవుతూంది

రెడ్‌ఆర్మీ నాజీశ్రేణులను అనేకచోట్లఛిన్నాభిన్నం చేస్తూంది. ఈవారం రెడ్‌ఆర్మీ ప్రారంభించిన మరొక కొత్తదాడిలో గోమెల్ మోగిలెవ్‌కు మధ్య 30 మైళ్ళ గండికొట్టి దానిని మరింత విశాలంచేస్తోంది. ఈరంగంలో గోమెల్ - మోగిలెవ్ - ఆర్షాలు జర్మన్ల శీతాకాలపు రక్షణ శ్రేణిలో ముఖ్యదుర్గాలు. గోమెల్ పోయింది; గోమెల్ - మొగిలెవ్‌ల మధ్య గండిగొట్టబడింది. ఈశ్రేణిని వెనుకవైపుగుండా పోవడానికి ష్లోబిన్ వశంకావాలి. అందుకే దానికోసం అతితీవ్రంగా సోవియట్ సైన్యాలు కదులుతున్నాయి.

కీవ్ రంగంలో జర్మన్ల తీవ్ర ప్రతిఘటనను రెడ్‌ఆర్మీ కొంతప్రదేశాన్ని వదలినతర్వాత నిలిపివేసింది. కీవ్‌కుపశ్చిమంగా 40-50 మైళ్ళలోనున్న బ్రూసిలావ్ వద్దను, జితోమిర్‌కు ఉత్తరంగా 10 మైళ్ళలోను, జర్మన్లు ప్రతిఘటన సాగించుతున్నారు. కాని రెడ్‌ఆర్మీ మొండిగా వానిని అరికట్టుతోంది. జర్మన్లు రెడ్‌ఆర్మీ పార్శ్వంపై హతమార్చే దెబ్బ కొట్టాలని ప్రయత్నించారు. కాని విఫలమయింది.

జితోమిర్ - ఫాస్టావ్ శ్రేణికి బెసర్బియా సరిహద్దు 140 మైళ్ళలోవుంది. అందుచేతనే జర్మనీ ఇచట ఇంతతీవ్రప్రతిఘటన సాగించుతోంది. చెర్కాసీ పొలిమేరలో ప్రవేశించిన రెడ్‌ఆర్మీ, నీపరుమలుపులోని జర్మను రాకపోకలను ఛిన్నాభిన్నం గావించ ప్రయత్నించుతోంది. క్రిమెన్‌చగ్‌వద్ద జర్మను రక్షణ శ్రేణిలో గండిగొట్టబడింది. ఇచట ప్రారంభమైనదాడి ఖెర్సన్ వైపుకు పురోగమించుతోంది. మరొకప్రక్క నికొపోల్‌ను సోవియట్ సైన్యాలు సమీపించుతున్నాయి. ఆ విధంగా నీపర్‌మలుపులో క్రివాయ్‌రాగ్-నికోపోల్ ప్రదేశంలోని జర్మన్లను రెడ్‌ఆర్మీ పిప్పిపిప్పి చేస్తోంది. రెడ్‌ఆర్మీ లక్ష్యం నీపరుమలుపులోని సైన్యాలను హతమార్చడమేగాక బుగ్‌నదిని ఒడిస్సాను సమీపించడం.

నవంబరు విప్లవ దినోత్సవంలో కామ్రేడ్ స్టాలిన్ తన ఉపన్యాసంలో చెప్పినట్లు వైట్‌రష్యా - యుక్రైన్, బాల్టిక్ రాష్ట్రాల విముక్తి సమీపించింది.

మిత్రరాజ్యాల మందగమనం

భీషణప్రతిఘటనను పారద్రోలుతూ రెడ్ ఆర్మీ ముందంజ వేస్తూంది. కాని ఇటలీలో యుద్ధం మందకొడిగా సాగుతోంది. ఇటలీ యుద్ధం మరింత తీవ్రంగా సాగించాలంటూ మాస్కో పత్రిక "వార్ అండ్ వర్కింగ్ క్లాస్" హెచ్చరించింది. శత్రువుల వెనుక భాగంలో సైన్యాలను దింపడానికి మిత్రరాజ్యాలకు అవకాశమున్నదని కూడా హెచ్చరించింది. ఇటలీ యుద్ధం ఈడ్చినకొద్దీ ఉత్తర ఇటలీలో జర్మన్ల నెదిరించుతున్న కార్మికులూ ప్రజలూ మరింత బాధలకు లోనుగావలసి వస్తుంది.

ఇటలీలో యుద్ధాన్ని మందకొడిగా సాగించడమేగాక, మధ్యధరాసముద్రంలో సామాస్ దీవిని మిత్రరాజ్యాలు ఖాళీచేశాయి. ఇదివరకే లీరోస్, కాస్ దీవులను ఖాళీచేశాయి. 1943 సంవత్సర మందంతటా మిత్రరాజాలకే విమాన బలాధిక్యత గలదని రెడ్‌స్టార్ వ్రాస్తోంది. ఆవిషయానికి ప్రత్యక్షంగా ఇపుడు బెర్లిన్‌పైన గావించే బ్రహ్మాండమైన దాడులే నిదర్శనం. అయినా, ఈ చిన్న దీవులకు తగిన విమాన సహాయాన్ని పంపకపోవడానికి కారణం ఏమిటి? ఇటలీలో యుద్ధం మందకొడిగా ఈడ్వడానికి కారకులెవరో, ఈ అపజయాలకు కూడ కారకులువారే. బ్రిటిషు మంత్రివర్గంలోని అభివృద్ధి నిరోధకుల నిర్లక్ష్యమూ, ఆత్మ సంతృప్తియే వాటికి కారణం. ఈ అభివృద్ధి నిరోధకుల చర్యలు శృతిమించి రాగాన పడుతున్నాయి.

అభివృద్ధినిరోధకుల ఆటలు

మారిసన్, ఫాసిస్టు నాయకుడగు మోస్లేను వదిలాడు. కాని ప్రజలు గుడ్డిగాలేరు. దేశమంతా ఒక్కుమ్మడిగా అసమ్మతిని తెలియపరచింది. బ్రిటిషు రాజకీయ చరిత్రలో ఈ మధ్య ఇంత వేగంగా, ఇంత బ్రహ్మాండంగా ప్రజలు తమ అసమ్మతిని చూపిన మరొక ఘటనలేదు.

మారిసన్ ఏ పార్టీ తరఫున మంత్రి అయ్యాడో ఆ లేబర్ పార్టీ సైతం దానిని సమర్థించలేక పోయింది. ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్, లేబరుపార్టీ, కో-ఆపరేటివ్ ఉద్యమాలకు ప్రాతినిధ్యం వహించిన నేషనల్ కౌన్సిల్ ఆఫ్ లేబర్ ఈ చర్యను ఖండించింది. లేబరు పార్టీ కార్యనిర్వాహకవర్గం, ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ జనరల్ కౌన్సిల్ కూడా ఖండించాయి. ఉద్రిక్తులైన ప్రజల సంరంభాన్ని ఆపడానికి వచ్చిన క్రిప్స్‌ను లెక్కచేయకండా కార్మికులు తమ ప్రదర్శనాలను సాగించారు.

మోస్లే విడుదలతో మేల్కొన్న బ్రిటిషు కార్మిక ప్రజానీకం, ముమ్ముందు ఇట్టి అభివృద్ధినిరోధకచర్యలు కొనసాగకుండాచూస్తుందనడంలో సందేహంలేదు.

ఫాసిస్టు మోస్లేను విడుదలచేసిన మారిసన్, వందలకొలదిగా భారతదేశపు బందిఖానాలలో మ్రగ్గుచున్న ఫాసిస్టువ్యతిరేక డెటిన్యూలను గురించి నోరెత్తడు. కాని యిలాంటి అభివృద్ధినిరోధక చర్యలు జయించలేవు. ఫ్రెంచికమిటీ విషయంలో వలెనే ఓడిపోతాయి. ఫ్రాన్సులో రహస్యఉద్యమం సాగించుతున్న కమ్యూనిస్టుల ఒత్తిడిఫలితంగా విచీ అనుకూలముఠా నంతా ఫ్రీఫ్రెంచి కమిటీ నుండి రద్దుచేయవలసివచ్చింది. ఇక జీరో ఒక్కడే మిగిలాడు. దీని అర్థం, ఫ్రెంచి రహస్య విప్లవోద్యమం ముందు, జీరోను సమర్థించే ఆంగ్లో-అమెరికన్ అభివృద్ధినిరోధకముఠా తోకముడుచుకోవలసి వచ్చింది. చిట్టచివరకు బ్రిటిష్—అమెరికా ప్రభుత్వాలు తమ తమ రాయబారులను పంపవలసివచ్చింది (సోవియటు రాయబారి విషిన్స్కీ కూడ అల్జీర్సు చేరాడు).

లెబనాన్ సమస్య
అభివృద్ధినిరోధకులు పంథా

కాని ఫ్రెంచి అభివృద్ధి నిరోధకముఠా చేతులు ముడుచుకు కూర్చోలేదు. లెబనాన్‌లో మాండేట్ విషయమైవచ్చిన తగాదా అవకాశం తీసుకొని, హెల్లూ లెబనాన్‌లోచిచ్చురగిల్చాడు లెబనాన్ పరిస్థితుల నాధారంగా తీసుకొని బ్రిటిషు అభివృద్ధి నిరోధకులు ఫ్రీ ఫ్రెంచి కమిటీపై కారాలు మిరియాలు నూరసాగారు. లెబనాన్ స్వాతంత్ర్య మార్గాన్ని అడ్డగించకూడనిమాట నిజమే. అచ్చటి స్థానిక అధికారి హెల్లూచేసిన పనులు క్షమించరానివే. కాని, దీని నాధారంచేసుకొని ఫ్రీఫ్రెంచి కమిటీ నంతా దుమ్మెత్తి పోయడం క్షమించరానిది. లండన్ టైమ్సు పత్రికావిలేఖరిసైతం "భారత దేశ ప్రతిష్టంభనను అంతమొందించడానికీ, భారతదేశంలో రాజకీయ ఖైదీలను విడుదల చేయడానికీ, అంగీకరించనిమొనగాళ్ళే అక్కడ లెబనాన్ గురించి గంభీరోపన్యాసాలు గావించుతున్నారు" అని వ్రాశాడు. ఈవిషయమే పార్లమెంటులో కొందరు కార్మిక సభ్యులు తెలియజేశారు. డైలీ వర్కరు (బ్రిటిషు కమ్యూనిస్టు పత్రిక) ఫ్రెంచికమిటీని దుమ్మెత్తిపోస్తూన్న వారిని సంబోధించి ఇలాఅంది: "లెబనాన్‌పై మీరు చూపుతూన్న ప్రేమ-ఆదరాలలో కాస్త భారతదేశానికి పంపండి!"

లెబనాన్ పరిస్థితులు కొంతవరకు చక్కబడ్డాయి. మాజీమంత్రులు తిరిగి యథాస్థానం ఆక్రమించారు. విచీ అనుకూలముఠా అధ్యక్ష్యంకిందనున్న సైనికులు తిరిగిఘర్షణ తీసుకరాబోతే, కాట్రూ వెంటనే జోక్యంకలుగజేసుకొని ఆపివేశాడు. చచ్చిపోయిన ఫ్రెంచి మాండేటును రద్దుజేసే విషయాన్ని జాతీయ నాయకులు తిరిగి లేవదీసి ఘర్షణలకు త్రోవ దీయకుండా, రాయబారాల ద్వారా పరిష్కరించుకొంటారని ఆశించవచ్చు.

పసిఫిక్‌రంగం

పసిఫిక్‌లో అమెరికాయే చొరవదీసికొంటోంది. ఇందుకు నిదర్శనం ఇటీవల గిల్బర్టు దీవులలో అమెరికా సైన్యాలు కాలుపెట్టడమే. మెకార్థర్ సైన్యాలు రాబాల్‌ను వశపరచుకునేందుకు జపానుపై గట్టి దెబ్బలు తీస్తున్నాయి. వార్ అండ్ వర్కింగ్‌క్లాసులో ఒక రచయిత చెప్పినట్లు "పసిఫిక్‌లో చొరవ అమెరికన్లకు పోవడమేగాక, జపానులో ఆంతరంగిక పరిస్థితికూడా అల్లకల్లోలంగావుంది."

రాజకీయ ప్రతిష్టంభనవల్లా, బెంగాల్ కరువువల్లా, భారతదేశమొక్కటే ఈ యుద్ధరంగంలో బలహీన ప్రదేశం. అందుచే అమెరికన్ విజయాలకు కంపించుతున్న జపాను నిస్పృహతో భారతదేశంపై దుమకడానికి సిద్ధపడినా పడవచ్చు.

— తుమ్మల వెంకటరామయ్య.

29—11—43

అజంజాహీ మిల్లు కార్మికులపై హత్యాప్రయత్న నేరము!

వరంగల్లు అజంజాహీ బట్టలమిల్లు కార్మికులు గత ఆగస్టు నెలలో యూనియను ఏర్పర్చుకున్నప్పటినుండి మిల్లు మేనేజరు ఏవిధంగానైనా యూనియన్ను భగ్నంచేయాలని ప్రయత్నిస్తూఉన్నాడు. అనేక సాకులమీద కార్మికుల జీతాలు తగ్గించడం, యూనియన్ వర్కర్లను పనిలోనుంచి తీసివేయడం మొదలగు చర్యలద్వారా కార్మికులకు యూనియన్ యెడల వ్యతిరేకభావం కల్పించాలని ప్రయత్నించాడు, కాని లాభంలేకపోయినది. యూనియనుపట్ల కార్మికులకుఅభిమానంహెచ్చినది.

చివరకు కార్మికులను భయపెట్టి అయినా యూనియన్‌ను భగ్నంచేయాలని మేనేజరు పూనుకున్నాడు. రౌడీలని ప్రసిద్ధికెక్కినవారిని ప్రత్యేకంగా పనిలో పెట్టుకున్నాడు. ఈరౌడీలు యూనియన్ వర్కర్లను, సభ్యులను బెదరించడం, తిట్టటం కొట్టటం, జరుగుతూ ఉండేది. నరసయ్య అనే హెడ్‌జాబరు ద్వారా హిందూ ముస్లిం కలహాలను రెచ్చగొట్ట చూచాడు. కొద్ది రోజులక్రితం, ఉత్తర హిందూస్థానానికివెళ్ళిన సర్దార్ అనే జాబరును ప్రత్యేకంగా రప్పించి, సూపర్‌వైజర్ అనే కొత్త పదవిని సృష్టించి, పనికోకి తీసుకున్నారు. ఇతడు కార్మికులను అనేకవిధాల భయపెట్టడం, హిందూ ముస్లిం విభేదాలు తీసుకురావాలని ప్రయత్నించడం, ప్రారంభించాడు.

మేనేజిమెంటు బంటులయిన రౌడీలుకార్మికులఇండ్లకుగూడ వచ్చి దౌర్జన్యంచేయప్రారంభించారు. ఈమధ్య ఒక సంఘర్షణలో యూనియను కార్మికులకు, రౌడీలకు దెబ్బలు తగిలినవి. వెంటనే స్థానిక పోలీసులు, యూనియన్ వర్కర్లు, రౌడీముఠాలోని కొంతమందిని హత్యచేయుటకు ప్రయత్నించారని, 13 రిని అరెస్టుచేసి కేసు బనాయించారు. మేనేజిమెంటు రౌడీముఠాకు పూర్తిసహాయం చేస్తూ కేసును నడుపుతూంది. ఇదేసమయంలో జాబరు సర్దార్, కంపెనీ తరఫున మిల్లు ఆవరణలోనే ఒకయూనియన్ పెడతామని, అందులో చేరవలసిందని కార్మికులను అనేక విధాల భయపెట్టడం, నిర్బంధించడం చేస్తున్నాడు. యూనియన్‌కు వ్యతిరేకంగా తీవ్రప్రచారంచేస్తున్నాడు.

కాని, మేనేజిమెంటు ఈ ప్రయత్నాలన్నీ వృధాఅవుతున్నవి. ఈదెబ్బలాటలకు కారణం మిల్లు మేనేజిమెంటేనని వరంగల్లు ప్రజలు గ్రహించారు. అందుకనే స్థానిక వకీళ్ళలో చాలమంది - హిందువులు, ముస్లింలు - యూనియన్ కార్మికుల తరఫున వాదించుటకు ముందుకు వచ్చారు. కార్మికులు ధైర్యంగా నిలబడ్డారు.

మిల్లు మేనేజిమెంటు పాలసీ ఎట్టి దురంతాలకు దారితీస్తున్నది ప్రభుత్వం ప్రజలు గ్రహించాలి. మేనేజిమెంటుయొక్క ఈ దురాగతాలను ఆపుచేయించాలి.

(3 వ పేజీ తరువాయి) హామీ యిస్తారేమోనని దురాశపడి వచ్చిన ధనికరైతు లందరూ నిరాశచెందారు.

జిల్లా రైతులకు విజ్ఞప్తి

ఇట్టి అభివృద్ధినిరోధకుల విచ్ఛిన్న ప్రయత్నాలను అరికట్టవలసిందని జిల్లా రైతులకు విజ్ఞప్తి చేస్తున్నాను. కుల—మత విచక్షణలు లేకుండా, ధనిక—బీద తారతమ్యాలను పాటించకుండా, రైతు లందరూ రైతు సంఘంలో సభ్యులుగా చేరండి. కొద్దిమంది వ్యక్తులు ప్రభుత్వంచుట్టూ తిరిగినంతమాత్రంచేత మన కోర్కెలు యీడేరవు. మన ఐక్యతా బలమే విజయసాధనకు మార్గం. రామచంద్రారెడ్డిగారి కొత్తనినాదాలు జిల్లా రైతుసంఘంచే చిరకాలంనుండీ ప్రచారం చేయబడుతూన్నవనే విషయం మరువవద్దు.

డిసెంబరు 30 వతేదీతో రైతుసంఘాల్లో సభ్యులను చేర్చుగడువు అయిపోతుంది. కాన రైతు సోదరులెల్లరూ రైతుసంఘాల్లోనే విరివిగాచేరండి, రైతుసంఘాలద్వారా రైతుల కోర్కెలు నెరవేర్చుకొనుటకై రైతుసంఘాలను బలపర్చండి.

విద్యార్థులలో చీలికలంతరించాలి!

రాష్ట్రవిద్యార్థి మహాసభ తీర్మానాల సారాంశం

గుంటూరులో నవంబరు 12, 13, 14 తేదీలలో జరిగిన 19 వ ఆంధ్రరాష్ట్రవిద్యార్థి మహాసభలో ప్రతినిధులు చర్చించి యీక్రింది తీర్మానములను ఏకగ్రీవంగా ఆమోదించారు. ప్రథమంలో జాతీయోద్యమంలోను, విద్యార్థి ఉద్యమంలోను, దేశ స్వాతంత్ర్యముకు పాటుబడుచు మరణించిన యోధులకు సానుభూతిని తెల్పుచు ఒక తీర్మానం అంగీకరించబడింది.

ఐక్యతాతీర్మానం

నేడు ఆంధ్ర విద్యార్థి ఉద్యమంలో ఉన్న తాత్కాలిక చీలికలను అంతంజేసి ఐక్య విద్యార్థి ఉద్యమమునకు పునాదిగ "ఐక్యతకు సాగిరండు" అను తీర్మానమును చర్చించి ఆమోదించిరి. ఈతీర్మానం నేడు దేశంలో ఉన్నటువంటి సంక్షోభాన్ని అంతంజేసి జాతీయ ప్రభుత్వమును సాధించుటకు యీ క్రింది కార్యక్రమ ఆచరణకు ప్రతి విద్యార్థి పూనుకొనవలయునని హెచ్చరించుతుంది: నేడు మన దేశమునకు ఉన్న ఫాసిస్టు దాడి ప్రమాదంనుంచి తప్పించుకొనుటకు, దేశస్వాతంత్ర్యమును పొందుటకు, దేశ రక్షణను బలపర్చవలయును. దేశరక్షణను బలహీనపర్చువిధ్వంసకచర్యలను ప్రతిదేశభక్తుడు ఖండించాలి. మన దేశరక్షణకు మనం పూనుకోనియెడల బర్మా, మలయా దేశాల గతి మనకుకూడ తప్పదు. అందుకని ఫాసిస్టుఅనుకూలప్రచారంచేయువారినిప్రజలలోనుంచివేరు చేయవలయును. నేడు దేశమంతటావ్యాపించి, బెంగాలులో నిమిషమునకు 5 గురు చొప్పున ఆహుతిగొంటున్న ఆహారసమస్యా పరిష్కారానికి ప్రతివిద్యార్థి పూనుకొనవలయును. ఇదే నేడు దేశభక్తి. ఆహారసమస్యను పరిష్కరించుటకు, దేశమును జయప్రదంగా రక్షించుటకు, వెంటనే కాంగ్రెసు నాయకులను విడుదల చేయించాలి. దీనికి నేడు దేశంలోని ప్రముఖ రాజకీయసంస్థలయిన కాంగ్రెసు—లీగులమధ్య ఐక్యత అవసరం. ఈ ఐక్యతకు పునాదిగా ముస్లిం జాతుల స్వయంనిర్ణయ హక్కును కాంగ్రెసు అంగీకరించాలి. కాంగ్రెసు నాయకుల విడుదలకు ముస్లింలీగ్ పాటుబడాలి. పై ఆశయసిద్ధికై పాటుబడుటకు, విద్యార్థులుసంఘటితశక్తిగా ఉండుటకు, విద్యాలయాలుమూతపడకుండఉండుటకు, విద్యార్థులకుఅవసరమైన కాగితం, కిరసనాయిలు, ఆహారం సప్లయికి ఆందోళన చేయాలి. ఇదే నేటిపరిస్థితులలో దేశస్వాతంత్ర్యమునకు మార్గమని, ఈ కార్యక్రమమును అనుసరించుట ద్వారానే నేడు విద్యార్థులలోని తాత్కాలిక చీలికలను అంతం చేయగలమని తీర్మానం సారాంశం. విద్యార్థి సంఘం ఏరాజకీయ పార్టీ తొత్తుకాదని, మెజారిటీ సంఘ సభ్యులు నిర్ణయించిన రాజకీయ పంథానే నడచు ప్రజాస్వామ్య సంస్థయని, దేశభక్తియుతమయిన ప్రతి రాజకీయపార్టీకి చెందినవిద్యార్థులు సంఘసభ్యులుగాచేరవలసినదని వివరించి విద్యార్థి ఉద్యమఐక్యతకుసాగిరమ్మని ప్రతివిద్యార్థిని హెచ్చరించుతుంది.

మరొకతీర్మానంలో యుద్ధఫలితంగాకొరత ఏర్పడిన ఆహారం, కిరసనాయిలు, తెల్ల కాగితములు, విద్యాలయములను కాపాడుటకుఅవసరమైన విమానదాడి రక్షణ, ప్రథమచికిత్స మొదలయిన సమస్యల పరిష్కారమార్గములను వివరించుచు అంగీకరింపబడినవి.

విద్యావిధానం సవరించాలి

నేడు విద్యావిధానంలోని లోపములను సవరించి విద్యాభివృద్ధికి అడ్డుగా నున్న డిటెన్షన్లు, తక్కువ స్కాలర్‌షిప్పులు, పరీక్షవిధానములోని లోపములు, టెక్నికల్ విద్యా సౌకర్యములు తక్కువగా ఉండుట, నూటికి 40 మందికంటె హెచ్చుమందిని ప్యాసుచేయకపోవుటమున్నగులోపములను సవరించమని, ఒక తీర్మానం ఆమోదింపబడింది.

మరొకతీర్మానంలో నేటి విద్యావిధానము విద్యార్థులలోని వైజ్ఞానిక శక్తి సామర్థ్యాలను అభివృద్ధిచేయలేదు గనుక, విద్యార్థులలోని అభ్యుదయ రచయితలను, నటకులను, చిత్రకారులను, ఆటగాండ్రను ఆయా శాఖలలో సంఘటితపరచి వారిలోని వైజ్ఞానికశక్తిని అభివృద్ధిపరచుటకు అవసరమైన కార్యక్రమం, నిర్మాణ సలహాలను యిచ్చుచు అంగీకరింపబడినది.

ప్రత్యేకాంధ్రరాష్ట్రం కావాలి

ఆంధ్రరాష్ట్ర పారిశ్రామిక, వైజ్ఞానిక అభివృద్ధికి ప్రత్యేకాంధ్రరాష్ట్ర మవసరమని, ఆంధ్రరాష్ట్రోద్యమం భారత జాతీయోద్యమంలో ఒకభాగమేగాని, జాతీయోద్యమమునకు వ్యతిరేకం గాదని, ఆంధ్రరాష్ట్ర సంపాదనకు పాటుబడు అన్నిసంస్థల వేదికగా ఆంధ్రమహాసభ ఉండవలయును, గాని, ప్రత్యేక రాజకీయ కక్షగా ఉండరాదని, విద్యార్థులను భారత స్వాతంత్ర్యపోరాటాన్ని బలపర్చుట ద్వారానే ఆంధ్రరాష్ట్రమును సాధించగలమని వివరిస్తూ ఒకతీర్మానం అంగీకరింపబడినది.

దేశరక్షణను బలపర్చుటకు పాటుబడుచున్న విద్యార్థి సంఘముల కార్యక్రమమును నిషేధించుచున్న నిరంకుశాధికారులచర్యలను ఖండించుచు; పశ్చిమగోదావరిజిల్లా విద్యార్థి సంఘముపై నిషేధమును వెంటనే తొలగించమని తీర్మానించడమైనది.

లా కాలేజీని, ఇంజనీరింగు కాలేజీని పెట్ట నిశ్చయించినందులకు ఆంధ్రవిశ్వవిద్యాలయమును అభినందించుచు; రాయలసీమలోని కళాశాలలనుగూడ ఆంధ్ర విశ్వవిద్యాలయం క్రింద కలుపమని: యూనివర్సిటీ క్లాసులను తెలుగులోనికి మార్చమని కోరుచు ఒక తీర్మానము అంగీకరింపబడింది.

బెంగాలు, మలబారు, రాయలసీమ మున్నగు క్షామప్రదేశములలోని ప్రజలకు సాయం చేయమని విజ్ఞప్తి చేస్తూ వేరొక తీర్మానం అంగీకరింపబడినది.

ఇవిగాక ఫాసిస్టు వ్యతిరేక రాజకీయ ఖైదీలను విడుదలజేయమని, సత్తెనపల్లి హెడ్ మాష్టరు విద్యార్థులకు తెల్లకాగితములను అమ్మి లాభములుదీయుటను ఖండించుచు; కృష్ణా, అనంతపురంజిల్లాలలోని విద్యా సౌకర్యములను తగ్గించదలచిన ప్రయత్నములను ఖండించుచు; విద్యార్థి సంఘ నిధిపైన, డి స్టూడెంటుపైన; రాష్ట్రీయ స్వయంసేవక సంఘాలపై విద్యార్థి సంఘాల దృక్పథంను వివరించుచు ఏకగ్రీవంగా అంగీకరించబడినవి.

విశాఖ జిల్లాలో గాలివాన

అక్టోబరు 31 వ తేదీన చీపురుపల్లి, శ్రీకాకుళం, బొబ్బిలి, (సాలూరు), నరసన్నపేట తాలూకాలలో మధ్యాహ్నం 3 గంటలపాటు పెద్ద తుపాను చెలరేగింది. ఆగాలికి ఆగలేక, మర్రి, రావి, మామిడి, అరటి మొదలయిన చెట్లన్నీ కూకటివేళ్ళతో పెల్లగింపబడ్డాయి. విశాఖజిల్లా ప్రజలుఇంతవరకు యిటువంటి గాలివానను ఎన్నడూ యెరిగియుండరు.

ఇండ్లు కూలిపోయాయి

ఈ గాలివాన ఫలితంగా పూరిళ్ళు అన్నీ పూర్తిగా కూలిపోయాయి. ఒక్క చీపురుపల్లి తాలూకాలోనే 50000 ఇళ్ళు పూర్తిగా కూలిపోవడంగాని, కప్పులెగిరిపోవడంగాని జరిగింది. చీపురుపల్లి, శ్రీకాకుళం మొదలయిన పట్టణాల్లోకూడా పబ్లికు ఆఫీసులు బాగా దెబ్బతిన్నాయి. స్కూళ్ళు, హాస్పిటళ్ళు, ఆఫీసులు, అన్నీ పెంకుటింటివయినప్పటికి పాడయిపోయాయి. చీపురుపల్లిలో 3 వేరుశెనగమిల్లులు విశేషంగా దెబ్బతినటంవల్ల ఆడటంలేదు. సుమారు ఒకలక్ష రూపాయిలు నష్టం మిల్లులకే వచ్చింది.

గాలివానసమయంలో సుంచోడానికి చోటు దొరక్క ప్రజలందరు భయభ్రాంతులై ప్రాణలరచేతిలో పెట్టుకొని ఆ 3 గంటలు విపరీతమైన బాధపడ్డారు. ఒకమూల ఇళ్ళెగిరిపోతూవుండే గోడలు విరిగి మీదపడిపోతాయన్న భయంతో పిచ్చిపరుగులెత్తారు.

గురివిందాడ అనే అగ్రహారంలో కోనారి జోగయ్య తలదాచుకుందుకు స్థలందొరక్క చేలోవున్న చెట్టుతొర్రలో రాత్రంతా స్థంభించిపోయి కూర్చున్నాడంటే ఆరోజున వారి బాధలు అర్థమౌతాయి.

షేరుమహమ్మదుపురంలో గొడ్లను మేపుకుందుకు వెళ్ళిన 3 గురు కుర్రాళ్ళు ఆగాలికి కొండమీదనుండి తప్పించుకురాలేక, అక్కడనే బిర్రబిగుసుకుపోయి రెండురోజులవరకు స్మారకంలేకుండా పడివున్నారు. అక్కడక్కడ రైతులు దాచుకొన్న ధాన్యం, చోళ్లు, అన్నీ పాడైపోయాయి. ఇక ఇళ్లల్లోని సామానులన్నీ చెల్లాచెదరయిపోయాయి.

ఒక గ్రామంలో రెల్లివాళ్లు 30 కుటుంబాలవారున్నారు. అందరూ పిలినిగపళ్ళు, వెలగకాయలు, రేగుపళ్ళు, కూరగాయలు అమ్ముకొని బ్రతికేవారు. అందరికీ ఒక్కసారిగా గాలివాన నోట్లో మట్టిగొట్టింది. కొంపలు, గుడ్డలతోబాటు వారాధారపడ్డ చెట్లన్నీ విరిగిపోయాయి. కూరగాయలులేవు. ఇప్పుడు కూలిదొరక్క గంజిమానేసి కొందరు వేరుశెనగ కాయలు తింటున్నారు. పనిమాపెట్టండి అని గోలెత్తుతున్నారు. ఇలాగే ప్రతి గ్రామంలోను జీవనోపాధిని పోగొట్టుకొని అవస్థపడుతున్నారు.

పశువుల నష్టం

అనేక గ్రామాలలో ఆవులు, పోతులు, ఎడ్లు, మేకలు కొన్నివందలు చనిపోయి ఉంటాయి. ఒక్క ఫరీదుపేట, షేరు మహమ్మదు పురం గ్రామాలలోనే 15 ఎడ్లు చనిపోయాయి. తోటపాలెంలో ఆవులు 8 చనిపోయాయి. ఇతర నష్టాలతోపాటు పశువులనష్టం రైతుకు మరింత పెద్దదెబ్బ అయింది.

పంట నష్టం

గాలివాన దెబ్బతగిలిన అన్నితాలూకాలలో పంటలకు విశేషనష్టం కలిగింది.

ఈప్రాంతంలో కనుచూపుమేరలో ఎక్కడా పచ్చగా పండిన వరిచేలు కనబడడంలేదు. నల్లగా మాడిపోయి, గింజలులేని వెన్నులు చూస్తే వచ్చేసంవత్సరంవరకు వేలకొద్ది ప్రజలను పోషించగల చేలివేనా అని గుండె తరుక్కుపోతుంది. అనేక ప్రాంతాలలో 4 వ వంతు పంటకూడాలేదు. మరికొన్ని చోట్ల 16 వ వంతు పంటకూడాలేదు (బొడ్డిపల్లి). దీనినిబట్టిచూస్తే వచ్చేసంవత్సరం పంటవచ్చేలోపుగా భీషణమైన పరిస్థితులు ఏర్పడతాయేమోనని భయంవేస్తూంది.

ఇప్పటి వివరాల్నిబట్టి ఒక్క చీపురుపల్లి తాలూకాలోనే 25000 ఎకరాల పల్లంలోనూ, 5000 ఎకరాలలో సాగు జరగలేదు. మిగతా 20000 ఎకరాలలో పండవలసినదానిలో 3 వ వంతు పూర్తిగా గాలివానవల్లనష్టపడింది. కునికే నక్కపైన తాటిపండులాగ రెల్లిగెడ్డ 400 ఎకరాల పంటను ముంచేసి దాదాపు అంతా నాశనంచేసింది.

ఇక రైతుకు ఆదాయం వచ్చే వేరుశెనగ, మిరప చూద్దామంటే వాటి విషయం మరీ అధ్వానంగాఉంది. వేరుశెనగ కుప్పలు గాలికి పూర్తిగా ఎగిరిపోయి, ఏరిన కాయలు చాలా కుళ్ళిపోయి విశేషనష్టం కల్గింది. మిరపనారు ఊడ్చిన 3000 ఎకరాలలో 80% ఎండిపోయింది. 1000 ఎకరాలలో వేయవలసిన రాగి విత్తనాలలో 4వంతులుగాలివానవల్ల తడిసి, మొక్కలొచ్చేసి ఎందుకూపనికిరాకుండాపోయాయి. 1 వంతు మాత్రమే మిగిలాయి. తిరిగి కొనుక్కుందామంటే దొరకడంలేదు. 28000 ఎకరాలలో వేసిన ఉలవ పూర్తిగా నాశనమైంది.

పై పంట లన్నిటికి పై లెక్కల బట్టి సుమారు 20 లక్షల రూపాయిలవరకు ఒక్క చీపురుపల్లి తాలూకాలోనే గాలివానవల్ల నష్టం ఉంటుందని తేల్తూంది. ఇలాగే మిగతా తాలూకా లన్నిటిలోనూ. దీనికితోడుఉన్న కూరగాయల మొక్కలన్నీ పాడయ్యాయి. మామిడి, కొబ్బరి తిరిగి 2, 3 సంవత్సరాలదాకా కాపుకాసేటట్టులేవు- అరటితోటలన్నీ ధ్వంసమయ్యాయి.

ఈవిధంగా ప్రజలకు ఆదాయంగాని, ఆహారదినుసులుగాని గాలివాన లేకుండా చేసిపోయింది.

బియ్యం సప్లయి

ఒకమూల తిండికి ప్రజలందరు అల్లాడిపోతూవుండే ప్రభుత్వం వారానికి 1000 మందికి 3 బస్తాలిస్తున్నారు. అంటే మనిషికి వారానికి ⅓ శేరు దొరుకుతుంది- షాహుకార్లు దొంగవ్యాపారం సాగించకపోతే.

ఈ బాధలన్నిటి వల్ల బీద ప్రజలందరు తిండికి గుడ్డకు అవస్థపడుతూ చితికిపోతున్నారు.

నివారణకమిటీలకృషి

శ్రీకాకుళం, చీపురుపల్లి పట్టణాలలో డివిజనల్ రిలీఫ్ కమిటీలు పని చేస్తున్నాయి. ప్రభుత్వం గాలివాన నివారణకు రూ. 12000 మంజూరు చేసింది.

పై రెండు పట్టణాల్లోనూ 2 ఉచిత భోజనశాలలు ప్రేమసమాజంవారు నడుపుతున్నారు. శ్రీకాకుళంలో 150 మందికి, చీపురుపల్లిలో 40 మందికి ప్రతిరోజు ఒక పూట భోజనం పెడుతున్నారు- ఎక్కడా గుడ్డలుసప్లయి చేయలేకపోతున్నారు ఎంత అవసరంవున్నా.

పైదుర్భరపరిస్థితులనుగుర్తించి ప్రభుత్వం వెంటనే ఈదిగువ పనులు చేయాలి.

1. ప్రజల కవసరమైన వెదురు, కమ్మ తగినంత యిచ్చి యిండ్లు సక్రమంగా ఉండేటట్లు చూడాలి.

2. అన్ని గ్రామాలలోనూ పని చేయగలిగికూడా అనేకులు కూలిలేక మాడుతున్నారు. కాబట్టి, వారందరి జీవనోపాధికి కరువుపనులు (Relief Works) వెంటనే ఏర్పరచాలి.

3. గాలివానవల్ల అనేకమంది బీద ప్రజలు కూటికిలేక మాడుతున్నారు. వారికై కొన్ని కేంద్రాలలో ఉచిత భోజనశాలలు ఏర్పరచాలి.

4. ఆహార ధాన్యములు చాలావరకు నష్టపడుటవల్ల ప్రతి గ్రామానికి ఒక చౌకబియ్యం డిపో తెరిచి 1000 మందికి 30 బస్తాలకు తక్కువలేకుండ సప్లయి చేయాలి.

5. శాశ్వతంగా కరువు రాకుండా పంటల నభివృద్ధిచేయుటకు నాగావళి ప్రాజక్టు, నగరికటకం ప్రాజక్టును వెంటనే కట్టించాలి.

6. గాలివానకు దెబ్బతిన్న ప్రాంతంలో (ముఖ్యంగా విజయనగరం, బొబ్బిలి, సిరిపురం) ఆయా ఎస్టేట్లవారు ఈ సంవత్సరానికి శిస్తులకు పూర్తి రెమిషను యివ్వాలి.

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE